PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 240 | విజయవాడ, గురువారం 4 ఏప్రిల్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 4 April 2024 | Rs

కేజ్రీవాల్ అరెస్టు కేసులో
హైకోర్టు తీర్పు వాయిదా

- వాడిగా వేడిగా వాదనలు
- ఆప్‌ను దెబ్బతీయడమే ఇడి లక్ష్యమన్న సింఘ్వీ
- ఆమాద్మీకి ప్రత్యేక రక్షణలుండవన్న ఇడి

2



విశాఖలో కోల్‌కతా నైట్‌రైడర్స్ పరుగుల వరద పారించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా జట్టు 106 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా ఐపిఎల్‌లో రెండో అత్యుత్తమ స్కోర్ 272పరుగులు చేయగా.. ఛేదనలో ఢిల్లీ 166పరుగులకే కుప్పకూలింది. బ్యాటింగ్‌లో రాణించిన నరైన్(85)కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. 6



ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం వద్ద పింఛను కోసం క్యూకట్టిన లబ్ధిదారులు

పింఛను కోసం పడిగాపులు

నలుగురు వృద్ధులు మృతి

- అవసరం మేరకు జమకాని డబ్బులు
- సాయంత్రం వరకూ వేచి ఉన్న పింఛనుదారులు
- సచివాలయాల వద్ద కనీస సౌకర్యాలు కరువు

ప్రజాశక్తి- యంత్రాంగం

పింఛన్ల కోసం పింఛనుదారులు సచివాలయాల వద్ద పడికాపులు కాశారు. బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ జరుగుతుందని అధికారులు ప్రకటించినా ఈ సమాచారం తెలియక కొందరు, పింఛను అందుతుందో లేదోననే భయంతో మరికొందరు, ఎంత తీవ్రతకు భయపడి ఇంకొందరు ఉదయం తొమ్మిది గంటలకే ఆయా సచివాయాలకు చేరుకున్నారు. వారిలో నలుగురు వృద్ధులు మృతి చెందారు. కొన్ని సచివాలయాల వద్ద తాగు నీరు, టెంట్లు ఏర్పాటు చేయకపోవడం, అరకొరగా మాత్రమే కుర్చీలు ఏర్పాటు చేయడంతో పింఛనుదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. క్యూలైన్‌లో గంటల కొద్దీ నిల్చోలేక వృద్ధులు తీవ్ర అవస్థ గురయ్యారు. పండు ముదుసలులకు, వికలాంగులకు ఇంటికే పింఛను పంపిణీ చేయాలని ఆదేశించినా కొన్ని జిల్లాల్లో ఇది అమలు కాలేదు. సంబంధిత సచివాలయ ఉద్యోగి పంపిణీ చేయాల్సిన మొత్తానికి అనుగుణంగా డబ్బులు సమ కాకపోవడం, ఆలస్యంగా డబ్బులు జమ కావడంతో పింఛన్ల పంపిణీ తీవ్ర జాప్యమైంది. సాయంత్రం ఐదు గంటల తర్వాతే పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. అంతవరకూ వేచి ఉండలేక కొందరు పింఛనుదారులు వెనుదిగారు.

నలుగురు వృద్ధులు మృతి

పింఛను తీసుకోవడానికి వచ్చిన వారిలో నలుగురు వృద్ధులు మృతి చెందారు. తిరుపతి జిల్లా నెరబైలు గ్రామపంచాయతీ సచివాలయానికి వచ్చి వేచి ఉన్న అదే గ్రామానికి చెందిన షేక్ అసం సాహెబ్ (75) ఫిట్స్ వచ్చి కళ్లు తిరిగి పడిపోయారు. ఆయనను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పట్టణంలోని సాయినగర్‌కు చెందిన ఈశ్వరవాక లలితమ్మ (62) గాండ్లవీధిలోని శ్రీ స్వశక్తి భవనంలోగల సచివాలయానికి మధ్యాహ్నం వచ్చారు. సాయంత్రం ఆమెకు వడదెబ్బ తగిలి స్పృహ మిగతా 2లో

పెన్షన్ ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం

- తీవ్రంగా ఖండించిన సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సచివాలయాలకు రప్పించి వృద్ధులకు పెన్షన్ ఇవ్వలేని ప్రభుత్వ అసమర్థ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈమేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ప్రకటన విడుదల చేశారు. పెన్షన్ కోసం వచ్చి నలుగురు వృద్ధులు మరణించడంపట్ల విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. 3వ తేదీకి కూడా పెన్షన్ పంపిణీ చేయలేక వృద్ధులు, వికలాగులు, మహిళల్ని ఎండలో శిక్షించడం భావ్యం కాదని పేర్కొన్నారు. తక్షణం పెన్షన్లు పంపిణీ చేయాలని, ఎండ తీవ్రత దృష్ట్యా సచివాలయాల వద్ద షామియానాలు ఏర్పాటు చేయాలని, లబ్దిదారులకు ఇళ్ల వద్దకే వెళ్లి అందించాలని డిమాండు చేశారు. పెన్షన్‌దారుల కష్టాలకు వైసిపి, టిడిపి పార్టీలే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. వారి రాజకీయ సమరంలో వృద్ధులు, వికలాంగులు, మహిళలు సమిధల్లా మారుతున్నారని తెలిపారు. వీరికి రక్షణగా సిపిఎం కార్యకర్తలు నిలబడి అందరికీ పెన్షన్ ఇంటివద్దే సకాలంలో అందేలా ఆందోళనలు చేయాలని రాష్ట్ర కమిటీ కోరింది.

నేడు రాష్ట్ర కమిటీ సమావేశం

రాష్ట్రంలో పోటీచేసే అసెంబ్లీ స్థానాల సర్దుబాటు మరియు, సీట్లను ఖరారు చేసేందుకు నేడు అత్యవసర రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితి, వివిధ పార్టీల వైఖరులు, ఇతర వామపక్ష లౌకిక పార్టీలతో సిపిఎం ఎన్నికల సర్దుబాట్లపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

విశాఖ ఉక్కు చరిత్ర తెలుసా?

ప్రయివేటీకరణకు ఏ చట్టం అనుమతిస్తోంది? • కేంద్రానికి ప్రశ్నలు సంధించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

'ఏ చట్టం కింద విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించారు? ప్రైవేటీకరణకు ఏ చట్టం అనుమతిస్తోంది? ఇందుకు ఏమైనా చట్టం ఉందా? ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకునే ముందు ఆ కర్మాగారం ఉద్యోగులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఇతర లబ్ధిదారులను సంప్రదించారా? అసలు విశాఖ ఉక్కు కర్మాగార చరిత్ర తెలుసా?' అని కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్నలు సంధించింది. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మాజీ ఐపిఎస్ అధికారి లక్ష్మీనారాయణ, కెఎ పాల్, సువర్ణరాజు తదితరులు వేర్వేరుగా దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాలపై

న్యాయమూర్తులు జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారణ జరిపింది. పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వం నుండి వివరణలు కోరిన ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది. విచారణ సందర్భంగా 'ఉక్కు కర్మాగార భూముల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరి ఏమిటి? ఎన్ని ఉక్కు కార్మాగారాల్లో పెట్టుబడులను కేంద్రం ఉపసంహరణ నిర్ణయం తీసుకుంది? ఎన్ని ఆచరణలోకి వచ్చాయి?.' అని ప్రశ్నించింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టంగా చెప్పాలని ఆదేశించింది. అదే విధంగా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేఖ రాస్తే దానిపై ఎందుకు స్పందించలేదని కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాదిని ప్రశ్నించింది. సిఎం లేఖపై కేంద్ర ప్రభుత్వ స్పందన ఏమిటో చెప్పాలని ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌లో సిఎం రాసిన లేఖ గురించి కనీస



ప్రస్తావన లేదని ఆక్షేపించింది. విశాఖ ఉక్కు కర్మాగారం కోసం వివిధ వర్గాలు ఇచ్చిన భూమిని విక్రయించే విషయంలో పూర్తి వివరాలను అఫిడవిట్ రూపంలో తమ ముందుంచా లని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అదే మాదిరి విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రక్షించేందుకు విదేశాల నుంచి నిధులను తెస్తానని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థా పకులు కెఎ పాల్ ఇచ్చిన వినతిపై కూడా కేంద్ర వైఖరి తెలియజేయాలని ఆదేశించింది. ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేటరీ యాక్ట్ కింద ప్రత్యేక ఖాతా తెరిచేందుకు అనుమతించాలంటూ పాల్ ఇచ్చిన వినతి పై కూడా కేంద్రం వైఖరి తెలియజేయాలని పేర్కొంది.

రూ. 8 వేల కోట్లు తెస్తా : కెఎ పాల్

ప్రత్యక్షంగా హాజరైన కెఎ పాల్ కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే విదేశాల నుండి రూ. 8 వేల కోట్ల నిధులు తీసుకువస్తానని ధర్మాసనానికి తెలిపారు. తాను ఇక్కడ ఉండే ఆ నిధులను సమీకరిస్తానని చెప్పారు. అలా చేయలేకపోతే ధర్మాసనం ఏ శిక్ష విధించినా భరిస్తానని చెప్పారు. గత 45 ఏళ్లలో విశాఖ ఉక్కు పరిశ్రమ పన్నుల కింద 54 వేల కోట్ల రూపాయలను చెల్లించిందని చెప్పారు.

మరో న్యాయవాది వై కోటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ, భూముల అమ్మకాన్ని అడ్డుకోవాలని కోరుతూ అనుబంధ పిటిషన్ దాఖలు చేసినట్లు చెప్పారు.

ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం సేకరించిన భూములను అమ్మలేదని ఆర్ఐఎన్ఎల్ తరఫున న్యాయవాది ఎస్ వివేక్ చంద్రశేఖర్ తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమ సొంత నిధులతో కొనుగోలు చేసిన 25 ఎకరాలను మాత్రమే అమ్ముతున్నట్లు చెప్పిన విషయాలను కోర్టు రికార్డుల్లో నమోదు చేసింది. కేంద్ర ప్రభుత్వ న్యాయవాది సివిఆర్ రుద్రప్రసాద్ కల్పించుకుని, భూముల అమ్మకం వ్యవహారంపై ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదన్నారు. అన్నింటినీ చెప్పే చేస్తామని, పారదర్శకంగానే చేస్తామని, పత్రికలకు ప్రకటించే చేస్తామని చెప్పారు. ఇవే వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని హైకోర్టు ఆదేశించింది. కెఎ పాల్ ప్రతిపాదన సంగతి ఏమిటని అడిగింది. నిధుల్ని సమకూర్చుతామని గత మార్చిలో కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చినట్లు హైకోర్టు ప్రశ్నకు సమాధానంగా పాల్ చెప్పారు. పాల్ వినతిపత్రంపై కూడా కేంద్ర వైఖరిని చెప్పాలని ధర్మాసనం ఆదేశించి విచారణను వాయిదా వేసింది.

చందాపూర్‌లో ఘోరం

- మందుల తయారీ కంపెనీలో పేలిన బాయిలర్
- ఫ్యాక్టరీ ఎమ్‌డితో సహా ఏడుగురు మృతి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. మందుల తయారీ కంపెనీ బాయిలర్ పేలి ఎగిసిపడిన మంటలతో రియాక్టర్ విస్ఫోటనం చెందింది. పేలుడు, మంటల దాటికి కంపెనీలో భీతవాహ పరిస్థితి నెలకొంది. దట్టమైన పొగలు ఫ్యాక్టరీని కమ్మేశాయి. అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. మంటల్లో చికుక్కున్న పలువురు కార్మికులు తమను కాపాడాలంటూ ఆర్తనాదాలు పెట్టారు. కాలిన గాయాలతో పలువురు బయటకు పరుగులు తీశారు. రియాక్టర్ పేలుడు ధాటికి వందల మీటర్ల దూరంలో శవాలు ఎగిరిపడ్డాయి. బాయిలర్, రియాక్టర్ వద్ద పనిచేస్తున్న కార్మికుల్లో కొందరు అక్కడికక్కడే మృతిచెందారు. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో ఏం జరుగుతుందో చూసేందుకు లోపలికి వెళ్లిన ఫ్యాక్టరీ ఎమ్‌డి కూడా మరణించారు. ఎమ్‌డి సహా మొత్తం ఏడుగురు మరణించారు. పదుల సంఖ్యలో కార్మికులు గాయపడ్డారు. రియాక్టర్ పేలుడుతో ఫ్యాక్టరీ భవనంతో పాటు మూడు భవనాలు నేలమట్టమయ్యాయి. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని చందాపూర్ గ్రామ పరిధిలో ఉన్న ఎస్‌బి ఆర్గానిక్ కెమికల్ ఫ్యాక్టరీలో బుధవారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో ఈ ఘోరం జరిగింది.

మందు బిల్లులకు పౌడర్ తయారుచేసే ఎస్‌బి కెమికల్ కంపెనీ 20 ఏళ్ల క్రితం స్థాపించారు. ప్రస్తుతం కంపెనీలో 150 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో అత్యధిక మంది హత్నూర మండల ప్రాంతానికి చెందిన వాళ్లే మిగతా 2లో

సైనిక్ స్కూళ్లలో కాషాయీకరణ ఆపండి!

- సిపిఎం పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : సైనిక్ స్కూళ్లలో కాషాయీకరణ యత్నాలను విరమించుకోవాలని, వాటి జాతీయ, లౌకిక స్వభావాన్ని నిలబెట్టాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ పొలిట్‌బ్యూరో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దేశంలో సైనిక్ స్కూళ్ల నిర్వహణలో ప్రయివేటు రంగాల భాగస్వామ్యానికి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వీలు కల్పించడం పొలిట్‌బ్యూరో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సైనిక్ స్కూళ్లు సాంప్రదాయకంగా కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయం ప్రతిపత్తి కలిగిన సైనిక్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. దేశంలో ప్రతిష్టాత్మకమైన నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ నావల్ అకాడమీల్లో ప్రవేశం పొందేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంలో ఈ సైనిక్ స్కూళ్లు చాలా ముఖ్యమైన భూమిక వహిస్తున్నాయి. ఈ సైనిక్ స్కూళ్ల నుండి ఉత్తీర్ణులై బయటకు వచ్చిన విద్యార్థులు గణనీయ సంఖ్యలో దేశ రక్షణ బలగాల్లో ఉన్నత బాధ్యతలు చేపట్టినవారున్నారు. కేంద్ర ప్రభుత్వ నూతన విధానం కేవలం ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యం (పిపిపి) నమూనాలో నిధుల సమీకరణ, మౌలిక సదుపాయాల కల్పనలో పరస్పర పంచుకోవడానికి మాత్రమే పరిమితం కాదు, ఎస్ఎస్ఎస్‌తో కుదుర్చుకుంటున్న ఒప్పందాల్లో గణనీయమైన సంఖ్యలో ఆర్ఎస్ఎస్, బిజెపితో సంబంధాలున్న సంస్థలను కూడా ప్రభుత్వం చేర్చుతోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ప్రభుత్వ ఈ చర్యను సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. విద్య కాషాయీకరణను ఈ స్కూళ్లపై రుద్దడం వల్ల మన సైనిక వ్యవస్థల్లో ఉన్నత లౌకిక ప్రమాణాలపై దాని ప్రభావం పడే ప్రమాదం వుందని పొలిట్‌బ్యూరో హెచ్చరించింది. సైనిక పాఠశాలల జాతీయ, లౌకిక స్వభావాన్ని పరిరక్షించేందుకు గాను ప్రభుత్వం తక్షణమే ఈ చర్యను ఉపసంహరించుకోవాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేసింది.

సంఘ్ పరివార్ చేతిలో సైనిక్ స్కూళ్లు

- 62 శాతం కొత్త పాఠశాలలు ఆరెస్సెస్, బిజెపి నేతలకు అప్పగించిన కేంద్రం : నివేదిక

5

వైసిపికి కృపారాణి రాజీనామా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి వైసిపికి రాజీనామా చేశారు. శ్రీకాకుళంలో ని హోటల్ గ్రాండ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె ఈ మేరకు తెలిపారు. వైసిపి తనకు ఏ మాత్రమూ ప్రాధాన్యత ఇవ్వకపోవడం, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నించినా అపాయింట్‌మెంట్ లభించకపోవడంతో పార్టీలో కొనసాగలేక ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. అన్ని పార్టీల నుంచీ తనకు ఆహ్వానం ఉందని, కార్యకర్తలతో చర్చించి ఏ పార్టీలో చేరేదీ త్వరలో వెల్లడిస్తానని చెప్పారు. కాగా, కృపారాణి 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి శ్రీకాకుళం ఎంపిగా పోటీ చేసి కె.ఎర్రన్నాయుడుపై విజయం సాధించి సంచలనం సృష్టించారు. కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆమె మళ్లీ కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం.



తైవాన్‌లో తీవ్ర భూకంపం

- 9 మంది మృతి, 900 మందికిపైగా గాయాలు
- డజన్ల సంఖ్యలో గల్లంతు
- పేకమేడల్లా కూలిన భవనాలు

హ్యూలిన్ (తైవాన్) : గత 25ఏళ్ళలో ఎన్నడూ లేని రీతిలో తైవాన్‌లో బుధవారం తీవ్ర భూకంపం సంభవించింది. రెక్టార్ స్కేలుపై 7.4 తీవ్రతగా నమోదైన ఈ భూకంపంలో ఇప్పటివరకు 9 మంది మరణించారు. 900 మందికి పైగా గాయపడ్డారు. జాతీయ పార్క్‌కు వెళ్ళే దారిలో గల ఒక హోటల్‌లో దాదాపు 50 మంది కార్మికుల ఆచూకీ గల్లంతయినట్లు అధికారులు భావిస్తున్నారు. మైనింగ్ ఏరియాలో మరో 80 మంది చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. అయితే వారు గని లోపల వున్నారా లేక బయటా అనేది వెంటనే తెలియరాలేదు. భూకంప తీవ్రతకు భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. భూకంప నాభి తూర్పు కౌంటీ హ్యూలిన్‌లో వుంది. భూమిలోపల 15.5 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించింది. అందువల్ల ఈ ప్రాంతంలో విధ్వం సం తీవ్రత బాగా కనిపిస్తోంది. బుధవారం మిగతా 2లో

జైలులో స్వతంత్ర మీడియా బందీ

ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

దేశంలో ఎండమావిగా మారిన న్యాయం

దేశంలో న్యాయం ఎండమావిగా మారింది. స్వతంత్ర మీడియా తీవ్రమైన వేధింపులు, ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. ఆర్థిక పరమైన అవరోధాలు, దొడ్డిదారిలో స్వాధీనాలు, పత్రికాధిపతులను ఏకంగా జైలులో పెట్టడాలు వంటి చర్యలు స్వతంత్ర మీడియా ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రఖ్యాత స్వతంత్ర న్యూస్ పోర్టల్ 'న్యూస్‌క్లిక్' సంపాదకులు ప్రబీర్ పుర్కాయస్థను జైలుకు పంపిన ఉదంతం భారత దేశంలో పత్రికా స్వేచ్ఛ ఎంతటి ప్రమాదంలో ఉందో తెలియజేస్తోంది. గతేడాది అక్టోబరు నుండి తీవ్రవాద అభియోగాలపై ఆయనను జైల్లో ఉంచారు. ఈ విషయంలో న్యాయ వ్యవస్థ మౌనం చాలా ప్రమాదకరం. న్యాయ వ్యవస్థ సమగ్రతను ఇది ప్రశ్నార్థకం చేస్తుంది. మార్చి 26న దాదాపు 600 మంది సీనియర్ న్యాయవాదులు భారత ప్రధాన న్యాయమూర్తికి ఓ బహిరంగంగా లేఖ రాశారు. ఫిబ్రవరిలో 'క్యాంపెయిన్ ఫర్ జ్యుడీషియల్ అకౌంటబిలిటీ అండ్ రిఫార్మ్స్' సంస్థ నిర్వహించిన మూడు రోజుల సదస్సులో వచ్చిన అభిప్రాయాలను క్రోడీకరిస్తూ వారు ఈ లేఖ రాశారు. 'న్యాయపాలన, నిర్వహణ, పౌర స్వేచ్ఛ, రాజకీయ హక్కులతో కూడిన కేసుల్లో సుప్రీం కోర్టు ధోరణి' అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తుల నుండి సీనియర్, యువ న్యాయవాదులు పలువురు ఈ సెమినార్‌లో ప్రసంగించారు. ఇటీవల కాలంలో వ్యక్తులను ఏకపక్షంగా అరెస్టు చేయడం, నిర్బంధించడం ఎక్కువైపోయిందని, దేశవ్యాపితంగా ఈ ధోరణి కొనసాగుతోందని వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పైగా బెయిల్ ఇచ్చేందుకు దీర్ఘకాలంగా అమల్లో వున్న నియమ నిబంధనలను కూడా ఉల్లంఘిస్తున్నారన్నారు. న్యూస్‌క్లిక్‌పై దాఖలైన కేసే దీనికి తిరుగులేని ఉదాహరణ అని వారు పేర్కొనారు.

పేదలకు, అణచివేతకు గురైన లేదా దోపిడీకి గురయ్యే వర్గాలకు న్యాయం జరిగే పరిస్థితులు లేవు. ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను న్యాయమూర్తులు ప్రోత్సహించిన రోజుల్లో వారి గొంతులు వినిపించినప్పటికీ ఒక కట్టుబానిసకు గరిష్టంగా లభించేది స్వేచ్ఛ మాత్రమే, అంతేకానీ ప్రత్యామ్నాయ ఉపాధి కాదు, వేతనాలు కాదు, అటువంటప్పుడు అది కచ్చితంగా న్యాయం జరిగినట్లు కాదు. మహిళా పోలీసులు నిర్వహించే పోలీసు స్టేషన్లు వున్నా, అక్కడా న్యాయం జరగడం లేదు. మతపరమైన, భాషాపరమైన లేదా జాతి పరమైన మైనారిటీలు భారతదేశంలో రానురాను ఏకాకులుగా మిగిలిపోతున్నారు.

ఉదార ప్రజాస్వామ్య వ్యవస్థలో క్రిమినల్ జస్టిస్ వ్యవస్థ తీరుతెన్నులు ఇలా వున్నాయి. న్యూస్‌క్లిక్, దాని వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ కేసు విషయానికి వస్తే ఎవరో వేసిన నిందలకు ఒకరోజు ఉదయమే ఆయన్ను అరెస్టు చేశారు. 2021 ఫిబ్రవరిలో ఒకరోజు 8 మంది వ్యక్తులు పుర్కాయస్థ ఇంటికి వచ్చి 113 గంటలపాటు ఇంట్లోనే వుండి ప్రతి మూలా వెతికారు, వారేమనుకున్నారో అవైతే కనబడలేదు. కానీ చిట్టచివరకు ల్యాప్‌టాప్, ఏవో కొన్ని ఫైల్స్ తీసుకెళ్లారు. వారికేమీ దొరక్కపోయేసరికి ఆ ఫ్లాట్‌ను జప్తు చేశారు. పుర్కాయస్థను ఆ ఇంట్లో వుండేందుకు అనుమతించారు. న్యూస్‌క్లిక్‌పై దర్యాప్తులో ఐదు సంస్థలు పాల్గొంటున్నాయి. 2020 ఆగస్టులో న్యూస్ పోర్టల్‌పై ఆర్థిక నేరాల విభాగం కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఆర్‌బిఐ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వ్యవహారంలో న్యూస్‌క్లిక్‌కు క్లీన్‌చిట్ ఇచ్చింది. అయినా ఇడి మళ్ళీ న్యూస్‌క్లిక్‌పై దాడులు చేసింది. మరో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. 2021 సెప్టెంబరులో ఆదాయపుపన్ను శాఖ అధికారులు దాడి చేశారు. తిరిగి 2023 అక్టోబరు 3న స్పెషల్ సెల్‌కు చెందిన 500 మంది సిబ్బంది న్యూస్‌క్లిక్‌లో పనిచేస్తున్న దాదాపు 90 మంది జర్నలిస్టులపై దాడి చేశారు. వారి నుండి 250కి పైగా ఎలక్ట్రానిక్ పరికరాలను, ఫోన్లను, హార్డ్ డిస్కులను, ల్యాప్‌టాప్‌లను, పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్నారు. ఆ నెల్లోనే చివరిలో సిబిఐ న్యూస్‌క్లిక్ కార్యాలయంపై మరోసారి దాడి చేసింది. తొలి రోజు నుండి న్యూస్‌క్లిక్ ఈ దాడులు, కేసుల వ్యవహారాన్ని వ్యతిరేకిస్తూనే వుంది. న్యూస్‌క్లిక్ కార్యాలయాలు, అందులో పనిచేసే వారి నివాసాలు, ఆఫీసులపై దాడి చేసినా, అన్ని ఫైళ్ళు, ఖాతాలు అందుబాటులోకి తెచ్చుకున్నా గత రెండేళ్ల నుండి న్యూస్‌క్లిక్‌పై ఒక్క ఫిర్యాదును ఇడి ఇవ్వలేకపోవడాన్ని మిగతా 2లో

ప్రతి ఇంటికి మంచి చేశాం

- 130 సార్లు బటన్ నొక్కి సంక్షేమాన్ని అందించాం
- పింఛన్లపై చంద్రబాబు కుట్ర
- వచ్చే ఐదేళ్లలో ఎవరి వల్ల మంచి జరుగుతోందో ఆలోచించండి
- 'మేమంతా సిద్ధం' సభలో సిఎం జగన్



రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రతి ఇంటికి మంచి చేశాం. ఇంటి ఇంటికి మేలు చేస్తూ, పిల్లల భవిష్యత్తు కోసం సత్యనిష్టత ప్రభుత్వం ఒక వైపు ఉంది. మరోవైపు గతంలో మూడు సార్లు అధికారంలో ఉండి అబద్ధం, మోసం, చెడు, చీకటిని రిటర్న్ గిఫ్ట్ ఇచ్చే బృందం ఉంది. ఫ్యాను మీద రెండు బటన్లు నొక్కి.. చంద్రముఖిని పెట్టెలో బంధించండి' అని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఏడో రోజు చిత్తూరు జిల్లా సదుం, పూతలపట్టు మండలల్లో కొనసాగింది. పూతలపట్టులో జరిగిన బహిరంగ సభలో సిఎం మాట్లాడుతూ.. సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలన్నీ ఇంటింటికీ చేరాయన్నారు. తమ హయాంలో 130 సార్లు బటన్ నొక్కి సంక్షేమాన్ని అందించామని తెలిపారు. చంద్రబాబు హయాంలో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు. కొత్త కొత్త మోసాలతో ముగ్గురు వస్తున్నారని, సూపర్ సిక్స్ అంటూ మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా ఇచ్చే పింఛనుపైనా చంద్రబాబు కుట్ర పన్నారని విమర్శించారు. చంద్రబాబు మనిషి నిమ్మగడ్డ ఇచ్చిన ఫిర్యాదు వల్లే వలంటీర్ వ్యవస్థను దూరం పెట్టే పరిస్థితి వచ్చిందన్నారు. అవ్వతాతలు పింఛను అందుకునేందుకు నడవలేక పడుతున్న అగచాట్లు చూసినప్పుడు ఈ చంద్రబాబు మనిషా, శాడిస్టా అని అనిపిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి వ్యక్తికి మనం ఓటు వేయడం ధర్మమేనా? అని ప్రశ్నించారు. 'ఒక మనిషి జీవితకాలంలో ప్రతి రోజు విలువైనది. అలాంటిది మీరు ఓటు వేయడమంటే ఏకంగా ఐదేళ్లు మీ భవిష్యత్తు వారి చేతిలో పెట్టినట్లే. మన ఇళ్లలో జరిగే మంచి కానీ, చెడు కానీ చేసే అధికారం వాళ్లకి ఇచ్చినట్లే, వచ్చే ఐదేళ్లలో ఎవరి వల్ల మంచి జరుగుతుంది, చెడు జరుగుతుంది అని ఆలోచన చేయండి. మీ ఇంట్లో అందరితో చర్చించి, ఎవరి వల్ల మీకు మంచి జరిగింది, ఎవరు ఉంటే మీకు మంచి జరుగుతుందని ఆలోచించి నిర్ణయం తీసుకోండి' అని ప్రజలను కోరారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో మీకు, మీ ఇంటికి ఏం చేశాడో ఆలోచన చేయాలని, మీ బ్యాంక్ ఖాతాలను గమనించండి, ఆయన పేరు చెబితే ఒక్క స్కీం అయినా గుర్తుకు వస్తుందా..కనీసం మీ ఖాతాలో జమ చేసినట్లు ఒక్క రూపాయి అయిన కనిపిస్తుందా? అని ప్రశ్నించారు.

అదే మీ జగన్,.. మీ ఇంటికి, మీ గ్రామానికి ఏం చేశాడో చూసేందుకు ఏ గ్రామానికి వెళ్లినా మంచి కనిపిస్తుందని తెలిపారు. జరగబోతున్న మహా సంగ్రామంలో మంచి వైపు నిలబడి యుద్ధం చేయడానికి సిద్ధం అంటున్న మహాప్రజాసముద్రమిది అని అన్నారు. సిఎం బస చేసిన సదుం మండలం అమ్మగారిపల్లి వద్ద కుప్పం నుంచి ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో, ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి ఆధ్వర్యంలో టిడిపికి చెందిన పలువురు నాయకులు వైసిపిలో చేరారు. పలమనేరుకు చెందిన పట్టు రైతులు సిఎంను కలవడానికి ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది ఆపేశారు.


రావులపాలెం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

గంజాయి మాఫియా రాజ్యమేలుతోంది

- పింఛన్లపై నీచ రాజకీయాలు
- ఇంటి వద్దకు వెళ్లి అధికారులు పింఛను ఇవ్వలేరా?
- ప్రజాగళం రోడ్‌షోలో చంద్రబాబు

ప్రజాశక్తి-రావులపాలెం, రామచంద్రపురం

రాష్ట్రంలో గంజాయి మాఫియా రాజ్యమేలుతోందని, కొత్తపేటలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రాష్ట్రంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దోచుకుంటున్నారని టిడిపి అధినేత నానా చంద్రబాబునాయుడు విమర్శించారు. డాక్టర్ బిఆర్.కోనసీమ జిల్లా కొత్తపేట, రామచంద్రపురంలో బుధవారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. రావులపాలెంలోని కెనాల్ రోడ్డులో, రామచంద్రపురంలోని ద్రాక్షారామం సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభల్లో చంద్రబాబు మాట్లాడారు. పింఛనును మొదటిగా ఎన్‌టిఆర్ ప్రారంభించారని గుర్తు చేశారు. పెన్షన్ల పంపిణీపై ఈ ప్రభుత్వం నీచమైన రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ప్రతిపక్షాలపై బురద జల్లేందుకు పింఛన్లు ఇవ్వకుండా చేశారని, అధికారులు ఒక్క నెల కూడా ఇంటి వద్ద పింఛన్లు ఇవ్వలేరా? అని ప్రశ్నించారు. పింఛను డబ్బులు వచ్చే వరకు వృద్ధులు, వికలాంగులకు పార్టీ శ్రేణులు అండగా ఉండాలని కోరారు.వలంటీర్ వ్యవస్థకు తాను వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. కానీ వలంటీర్లు రాజకీయం చేస్తే వ్యతిరేకిస్తానన్నారు. పచ్చని కోనసీమ దోపిడీ ముఠాలకు అడ్డాగా మారిందని ఆరోపించారు. వైసిపి హయాంలో వ్యవసాయం, నీటిపారుదల, ఆక్వా రంగాలు కుప్పకూలాయని, వాటిని కాపాడే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. కోనసీమలో ఏడు నియోజకవర్గాల్లో ఉన్న అభ్యర్థులను, ఎంపిని గెలిపించాలని అభ్యర్థించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పేదలుగా ఉన్న కాపులకు కూడా న్యాయం చేస్తామని అన్నారు. రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలనను పోగొట్టి సుపరిపాలన అందించేందుకు టిడిపి, జనసేన, బిజెపి కలిసి ముందుకు వచ్చామని వివరించారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తెలుగు జాతిని కాపాడుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపి అభ్యర్థి గంటి హరీష్ మాధుర్, కొత్తపేట అసెంబ్లీ నియోజవర్గ అభ్యర్థి బండారు సత్యానంద రావు, పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రమణ్యం, అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షులు రెడ్డి అనంతకుమారి, జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

శాంతియుత ఎన్నికలే లక్ష్యం

- సిఇసి రాజీవ్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్లమెంటు, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుతంగా నిర్వహించడమే లక్ష్యంగా పనిచేయాలని సిఇసి రాజీవ్‌కుమార్ తెలిపారు. రానున్న ఎన్నికలకు సంబంధించి శాంతి భద్రతలు, భద్రతా బలగాల మోహరింపు, ఎన్నికల వ్యయ నిర్వహణ, సెన్సిటివిటి, నోడల్ అధికారుల నియామకం, నోటిఫికేషన్, పెయిడ్ హాలిడే, అంతర్జాతీయ సరిహద్దు అంశాలపై బుధవారం ఢిల్లీ నుంచి అన్ని రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లు, సిఎస్, డిజిపితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో సిఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జనవరి ఒకటి నుంచి ఇప్పటి వరకు రూ.258 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, ఇతర విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎపితో ఐదు రాష్ట్రాలు అంతర్రాష్ట్ర సరిహద్దులను కలిగి ఉ ందని, సరిహద్దుల్లో 105 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. శాంతి భద్రతలకు సంబంధించి సరిహద్దు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి కొంత మేర మావోయిస్టుల సమస్య ఉందని ఆ సమస్యను అధిగమించేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి, సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నీరబ్‌కుమార్ ప్రసాద్, రజత్ భార్గవ్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తాతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ శ్రీకారం

- ఐదు నుంచి వైఎస్‌ఆర్ జిల్లాలో షర్మిల ప్రచారభేరి
- 12న ముగింపు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ శ్రీకారం చుట్టింది. పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల చేపట్టనున్న బస్సు యాత్ర షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల ఐదవ తేదీ నుంచి 12 వరకు వైఎస్‌ఆర్ జిల్లాలోని కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ప్రతి రోజూ ఉదయం 9.45 గంటల నుంచి రాత్రి 9.45 గంటల వరకు ప్రచారం సాగనుంది. ఐదవ తేదీన బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, గోపవరం మండలాల కేంద్రాల మీదుగా ఎన్నికల ప్రచారం కొనసాగనుంది. ఆరవ తేదీన బద్వేల్, అట్లూరు, కడప, ఏడవ తేదీన దువ్వూరు, చాపాడు, ఖాజీపేట,.మైదుకూరు, బ్రహ్మంగారిమఠం, ఎనిమిదిన కమలాపురం, వల్లూరు, చెన్నూరు, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లి, పదిన చక్రాయపేట, వేంపల్లి, వేముల, పులివెందుల, లింగాల, సింహాద్రిపురం, 11న తొండూరు, యర్రగుంట్ల, కొండాపురం, ముద్దనూరు, మైలవరం, 12న జమ్మలమడుగు, పెద్దముడియం, ప్రొద్దుటూరు, రాజుపాలెం మండలాల్లో పర్యటించనున్నారు. ఉగాది పండుగ సందర్భంగా తొమ్మిదిన యాత్రకు విరామం ప్రకటించారు. షర్మిల బస్సుయాత్ర వివరాలను వైఎస్‌ఆర్ జిల్లా డిసిసి అధ్యక్షులు శ్రీరాములు వెల్లడించారు.


తూర్పుగోదావరి జిల్లా కడియంలో ఎంపిడిఒకు రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు

పెన్షన్లపై చంద్రబాబుది మొసలి కన్నీరు: పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెన్షన్లు వృద్ధులకు అందకుండా చేసి ఇపుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2019 ఎన్నికల సమయంలో రైతులకు జన్మభూమి కమిటీల ద్వారా డబ్బులు పంచినా తాము అడ్డుకోలేదన్నారు. అలాగే పసుపు-కుంకుమ పేరుతో డబ్బులు వేసినా ఆపాలని తాము ఇసికి ఫిర్యాదు చేయలేదన్నారు. ఇప్పుడు మాత్రం పెన్షన్లు ఆపాలని టిడిపి ఫిర్యాదులు చేసిందని విమర్శించారు.

'ఉక్కు' ప్రయివేటీకరణ దారుణం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయిటీకరించాలని చూడడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి ఆదినారాయణ, డిసిహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1147వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టిఎం విభాగాలకు చెందిన కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌పై కేంద్ర బిజెపి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు కార్మికులు చేస్తున్న పోరాటానికి ప్రజా మద్దతు అవసరమని అన్నారు. పరిశ్రమను లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేయకుండా ప్రయివేటు శక్తులకు ధారాదత్తం చేసేందుకు కుట్రలు చేస్తున్న మోడీ సర్కారుకు రానున్న కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

కొనసాగుతున్న వాలంటీర్ల రాజీనామాలు

- కృష్ణ, వైఎస్‌ఆర్ జిల్లాలో అత్యధికం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా వాలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 1,155 మంది వాలంటీర్లు రాజీనామాలు చేయగా ఈ నెల 2న మంగళవారం ఒక్క రోజే 740 మంది రాజీనామా చేశారు. గరిష్టంగా కృష్ణ జిల్లాలో 285 మంది, వైఎస్‌ఆర్ కడపజిల్లాలో 220 మంది, చిత్తూరులో 101 మంది, నెల్లూరులో 116 మంది రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. అత్యల్పంగా పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒక్కొక్క వలంటీర్లు రాజీనామా చేశారు. బుధవారంకూడా తూర్పు గోదావరి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా జిల్లాల్లో దాదాపుగా 200 మంది వలంటీర్లు రాజీనామా చేశారు.మరోవైపు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారంటూ ఇప్పటిదాకా దాదాపుగా 600 మంది వాలంటీర్లపై చర్యలు తీసుకుంది. అదే సమయంలో అధికారపార్టీ నేతల నుండి వీరిపై ఒత్తిళ్ల కొనసాగుతున్నట్లు సమాచారం.

ఉద్యోగులు కూడా...

అక్కడక్కడ ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వీరిలో కొందరిపై ఇసి ఇప్పటికే చర్యలు తీసుకుంది. . ఓ ఉద్యోగ సంఘం నాయకుడు గత నెల 31న బద్వేల్, మైదుకూరు, ప్రొద్దుటూరు, కడప ఆర్‌టిసి డిపోల్లోని ఉద్యోగులతో మాటామంతీ పేరుతో లోపాయికారిగా అధికారపార్టీకి అనుకూలంగా ప్రచారం చేసినట్లు వార్తలు వచ్చాయి. సి-విజిల్ యాప్ ద్వారా ఈ తరహా ఫిర్యాదులు నిత్యం పదుల సంఖ్యలో ఎన్నికల కమిషన్‌కు అందుతున్నట్లు సమాచారం.

రూ. 8 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో అక్రమ నగదు సరఫరాను అధికారులు అడ్డుకుంటున్నారు. ఎక్కడికక్కడ వాహన తనిఖీలు చేపట్టి అధిక మొత్తంలో తరలిస్తున్న నగదు, మద్యాన్ని పట్టుకుంటున్నారు. సరైన పత్రాలు లేని వాటిని సీజ్ చేస్తున్నారు. బుధవారం పలు జిల్లాల్లో రూ.8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది తెలిపారు. ఏలూరు జిల్లా భీమడోలు మండలం గుండుగొలను- ఆగడాల లంక రోడ్డులో బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది చేపట్టిన వాహన తనిఖీల్లో ఓ కారులో రూ.లక్ష నగదు పట్టుబడింది. అశ్వారావుపేట నుంచి మక్కినవారిగూడెం వైపు వెళ్తున్న కారులో నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు సిబ్బంది తెలిపారు. చింతలపూడి మండలం అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద రూ.2,84,220, అదే చెక్‌పోస్ట్ వద్ద మరో రూ.70 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కామవరపుకోటలో రూ.1.6 లక్షల నగదు పట్టుబడినట్లు అధికారులు చెప్పారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి కూడలి వద్ద నువ్వులరేవుకు చెందిన బెహరా మోహనరావు స్కూటీని ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. ఎటువంటి పత్రాలు లేకుండా రూ.2 లక్షలు తరలిస్తుండగా పట్టుకున్నారు. అనంతరం నగదును స్వాధీనం చేసుకున్నామని ఫ్లాయింగ్ స్కాడ్ వనిత తెలిపారు.

మద్యం స్వాధీనం

ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు, విస్సన్నపేట, ఏ.కొండూరు మండలాల్లో నాటు సారాయి, మద్యం బెల్టు షాప్‌లపై విస్తృతంగా దాడులు చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తిరువూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు. మొత్తం ఐదు లీటర్ల సారాయి, 75 మద్యం బాటిళ్లు, బైక్‌ను స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్టు చేశామని ఆయన చెప్పారు.

కేజ్రీవాల్ అరెస్టు కేసులో హైకోర్టు తీర్పు వాయిదా

- వాడిగా వేడిగా వాదనలు
- ఆప్‌ను దెబ్బతీయడమే ఇడి లక్ష్యమన్న సింఘ్వీ
- ఆమాద్మీకి ప్రత్యేక రక్షణలుండవన్న ఇడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తన అరెస్టును సవాల్ చేస్తూ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తన తీర్పును బుధవారం వాయిదా వేసింది. అంతకుముందు దీనిపై కోర్టులో దాదాపు మూడు గంటలపాటు వాడిగా వేడిగా వాద ప్రతివాదాలు జరిగాయి. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వాలని అప్రూవర్లుగా మారిన సహ నిందితులను ఇడి బలవంత పెట్టిందని కేజ్రీవాల్ తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ, విక్రమ్ చౌదరి కోర్టుకు విన్నవించారు..ఇడి ఒత్తిడి తెచ్చిన మీదట ఎంపి మాంగుట శ్రీనివాసులు, ఆయన కుమారుడు రాఘవ, శరత్ చంద్రా రెడ్డి ఇచ్చిన వాంగ్మూలాలను ఇడి ప్రధానంగా చూపిస్తోందని అన్నారు. ఇడి తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీరాజు వాదన వినిపిస్తూ 'ఆప్‌ను దెబ్బతీయడానికే కేజ్రీవాల్‌ను ఎన్నికలకు ముందు అరెస్ట్ చేశారు.. ఎక్సైజ్ పాలసీ 2021-22 సంవత్సరానికి సంబంధించినది. ఆ తరువాత దానిని రద్దు చేశారు. అయినా ఈ కేసులో కేజ్రీవాల్‌కి వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవు. మాగుంట రాఘవ, శరత్ రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి మొదట ఇచ్చిన స్టేట్మెంట్ లలో కేజ్రీవాల్ గురించి వ్యతిరేకంగా మాట్లాడలేదు.. ఇందులో మాగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి కూటమిలో ఒక పార్టీ అభ్యర్థిగా ఉన్నారు. శరత్ చంద్రా రెడ్డి బిజెపికి ఎలక్టోరల్ బాండ్స్ కొన్నారు. . ఇడి పూర్తిగా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నది. మాగుంట రాఘవ మొదట ఇచ్చిన వాంగ్మూలాలను తొక్కిపెట్టి,.. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా చివరిలో ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని అరెస్టు చేసింది' అని సింఘ్వీ కోర్టుకు విన్నవించారు..

లంచ్ విరామం తర్వాత ఇడి తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ, . చట్టం ముందు సిఎం అయినా, ఆమాద్మీ అయినా ఒక్కటే అన్నారు. కేజ్రీవాల్ తన అరెస్ట్ పై సవాల్ చేస్తూ బెయిల్ కోరారు. ఆ ప్రక్రియ ముగిసి ప్రస్తుతం జ్యూడిషియల్ కస్టడీలో ఉన్నారు. లిక్కర్ పాలసీ కేసులో కేజ్రీవాల్ సూత్రధారి. కేజ్రీవాల్ తన పార్టీ పేరును తెలివిగా ఆమ్ ఆద్మీ అని పెట్టుకున్నారు.. ఆమ్ ఆద్మీ (సామాన్య వ్యక్తి) నేరం చేస్తే కటకటాల్లోకి వెళ్లాల్సిందే.. కానీ సిఎం అయినందున అరెస్ట్ చేయకూడదనడం సరికాదు.. మీరు దేశాన్ని దోచుకోవచ్చు, కానీ ఎన్నికలు వస్తున్నాయని ఎవరు మిమ్మల్ని ముట్టుకోవద్దంటే ఎలా ?. ఈ పిటిషన్ పై ఇరువైపు వాదనలను ముగించినట్లు పేర్కొన్న జస్టిస్ స్వర్ణకాంత శర్మ... తీర్పు రిజర్వ్ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఇదిలా వుండగా కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఈ నెల 7న జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్షలు చేపట్టాలని ఆప్ పిలుపునిచ్చింది. ఢిల్లీ మంత్రి, ఆప్ నాయకులు గోపాల్ రాయ్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆప్‌ను నాశనం చేయాలన్న దుష్ట తలంపుతోనే కేజ్రీవాల్‌ను మోడీ ప్రభుత్వం అరెస్టు చేయించిందన్నారు. దీనికి నిరసనగా దేశ వ్యాపితంగా ఆప్ కార్యకర్తలు ఇంటి వద్ద, నగరాల్లోను సామూహిక దీక్షలు చేపడతారని అన్నారు. మరో మంత్రి అతిషి మాట్లాడుతూ, మార్చి21న కేజ్రీవాల్‌ను అరెస్టు చేసినప్పటి నుండి ఆయన వేగంగా బరువు తగ్గుతున్నారని, ఆయనకు ఏదైనా హాని జరిగితే అందుకు బిజెపినే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

చందాపూర్‌లో ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన షిఫ్ట్‌లో మాత్రం 50 మంది కార్మికులు విధుల్లో ఉన్నట్టు సమాచారం. కంపెనీలో ఉత్పత్తి జరుగుతున్న వేళ ఉష్ణోగ్రతలు పెరిగి ఉన్నట్టుండి బాయిలర్ పేలింది. రసాయనాల కారణంగా నల్లని దట్టమైన పొగతో మంటలు ఆ ప్రాంతాన్ని చుట్టేశాయి. మంటల తీవ్రతకు రియాక్టర్‌లో భారీ పేలుళ్లు సంభవించాయి. దాంతో కంపెనీ మొత్తం దట్టమైన పొగమబ్బులు కమ్ముకున్నాయి. అగ్నికీలలు ఎగసిపడ్డాయి. భారీ పేలుళ్ల వల్ల బాయిలర్, రియాక్టర్ వద్ద పనిచేస్తున్న కార్మికుల్లో కొందరు అక్కడికక్కడే మృతిచెందారు. కాలిన గాయాలతో పలువురు బయటకు పరుగులు తీశారు. కంపెనీలో ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో చూసేందుకు లోపలికి వెళ్లిన కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రవి శర్మ, ప్రొడక్షన్ ఇన్‌చార్జీలు సుబ్రమణ్యం, దయానంద్‌తో పాటు మెయింటెనెన్స్ ఇన్‌చార్జి సురేష్ పాల్ కూడా మృతిచెందారు. కంపెనీ సిబ్బందితో పాటు కార్మికులు కలిపి ఏడుగురు మరణించినట్టు ప్రాథమికంగా గుర్తించారు. పేలుళ్ల దాటికి, మంటల వల్ల 30 మందికి పైగా కార్మికులు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. సమచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఐదుఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సంగారెడ్డి ఎస్‌పి చెన్నూరి రూపేష్ సంఘటనా స్థలా నికి చేరుకుని సహాయ చర్యలను పర్యవేక్షించారు. సంఘటనా స్థలాన్ని మంత్రి కొండా సురేఖ సందర్శించారు. అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి:సిఐటియు

ప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలను ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.మల్లేశం, కోశాధికారి కె.రాజయ్య డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, క్షతగాత్రులకు మెరుగైన ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిల్లాలోని ఫ్యాక్టరీలను తనిఖీ చేసి సేఫ్టీ మెజర్‌మెంట్స్ లేని కంపెనీలను సీజ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు.

పింఛను కోసం పడిగాపులు

(మొదటిపేజీ తరువాయి)

కోల్పోయారు. సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం గంగూరు గ్రామానికి చెందిన వెంపటి వజ్రమ్మ (80), పామర్రు మండలం కురుమద్దాలికి చెందిన పిల్లి నాగేశ్వరమ్మ (70)లు పింఛను తీసుకోవడానికి సచివాలయాలకు వచ్చి వడదెబ్బకు గురై మృతి చెందారు.

సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధుడు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరులో నాలుగో నెంబరు సచివాలయం వద్ద పెన్షన్ కోసం వచ్చిన కొంకాపల్లికి చెందిన కురసాల నరసింహమూర్తి (70) సొమ్మసిల్లి పడిపోయాడు. సచివాలయ సిబ్బంది సపర్యలు చేసి ఆయనను ఆస్పత్రికి తరలించడంతో కోలుకున్నారు.

అల్లూరి ఏజెన్సీలో సక్రమంగా పంపిణీ కాని పింఛన్లు

అల్లూరి సీతారామరాజు లోతేరు పంచాయతీ పరిధి తోటవలస, తదితర గ్రామాల వృద్ధులు, వికలాంగులు మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలోని గ్రామ సచివాలయానికి కాలినడకన వచ్చారు. ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడ్డారు. రాత్రి వరకూ వేచి ఉన్నా వారికి పింఛన్లు అందలేదు. అరకులోయ మండలంలో 6630 మంది పింఛనుదారులు ఉండగా సుమారు 150 మందికి మాత్రమే పింఛన్లు అందాయి. హుకుంపేట మండలంలో 33 పంచాయతీలు ఉండగా, నాలుగు పంచాయతీల పరిధిలోనే మాత్రమే పింఛన్లు పంపిణీ జరిగింది. డుంబ్రిగుడ మండలం అరకు మేజర్ పంచాయతీలోని సచివాలయానికి కాళ్లు చచ్చుబడిన లబ్ధిదారుడిని ఆటోలో తీసుకొచ్చారు. అడ్డతీగల మండలంలో సాంకేతిక కారణాల వల్ల పింఛన్లు పంపిణీ జరగలేదు. మారేడుమిల్లి మండలంలో పింఛనుదారులు దూర ప్రాంతాల నుంచి సచివాలయాలకు వచ్చినప్పటికీ పింఛన్లు ఇవ్వకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. పోలవరం నిర్వాసిత మండలాల్లోనూ పింఛన్లు అందలేదు. గురువారం నుంచి పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

- పశ్చిమగోదావరి జిల్లాలో రూ.68.92 కోట్లను పింఛనుదారులకు అందించాల్సి ఉండగా,. రూ.45.37 కోట్లు మాత్రమే బ్యాంకులకు విడుదలైంది. మిగిలిన రూ.24 కోట్లు విడుదల కావాల్సి ఉంది. బుధవారం మధ్యాహ్నం నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి జిల్లాలోని బ్యాంకులకు పింఛను డబ్బులు జమయ్యాయి. జిల్లాలో 2,34,884 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉండగా, వారిలో 68,103 మందికి మాత్రమే తొలిరోజు పింఛను అందింది.
- గుంటూరు జిల్లాలో 2.61 లక్షల మందికి పింఛను ఇవ్వాల్సి ఉండగా సాయంత్రం వరకు 80 వేల మందికి మాత్రమే అందింది. పల్నాడు జిల్లాలో 2.83 లక్షల మందికి ఇవ్వాల్సి ఉండగా 90 వేల మందికి పింఛన్లు ఇచ్చారు. గుంటూరులోని ఒక సచివాలయం అడ్మిన్‌కు ఆరు లక్షల రూపాయలు రావాల్సి ఉండగా, తొలిరోజు రెండు లక్షల రూపాయలు మాత్రమే వచ్చాయి. మరో సచివాలయం ఉద్యోగికి రూ.18 వేల మాత్రమే ఖాతాలో జమయ్యాయి.
- అనంతపురం జిల్లాలో 2.89 లక్షల మంది పింఛనుదారులు ఉండగా వారిలో 25 శాతం మందికి, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 2,72,767 మంది పింఛనుదారులు ఉండగా వారిలో 25 శాతం మంది మందికి తొలిరోజు పింఛను అందింది.
- నెల్లూరు జిల్లాలో తొలిరోజు 1.66 లక్షల మందికి (62 శాతం మందికి) రూ.47 కోట్లు పంపిణీ జరిగింది.
- కర్నూలు జిల్లాలో 2,46,871 పింఛనుదారులు ఉండగా తొలిరోజు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది 90,355 (36.6 శాతం) మందికి పింఛన్లు పంపిణీ చేశారు.

రూ.34 కోట్లు విలువ చేసే నగదు, ఆభరణాలు సీజ్

సిఇఒ ఎంకె మీనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.34 కోట్ల విలువ చేసే నగదు, ఆభరణాలు, ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా వెల్లడించారు. బుధవారం ఆయనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత తనిఖీల్లో రూ.11 కోట్ల నగదు, రూ.7 కోట్ల విలువైన మద్యం, రూ.10 కోట్లు విలువజేసే బంగారు, వెండి ఆభరణాలను సీజ్ చేశామన్నారు.

తైవాన్‌లో తీవ్ర భూకంపం

(మొదటిపేజీ తరువాయి)

ఉదయం 8 గంటల సమయంలో అందరూ పనులకు, పాఠశాలలకు వెళ్ళే హడావిడిలో వుండగా ఈ విపత్తు సంభవించింది. భవన శిథిలాల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు సహాయక బృందాలు ప్రయత్నిస్తున్నాయి. పలు చోట్ల పెద్ద మొత్తంలో కొండచరియలు విరిగిపడ్డాయి. సబ్‌వే వ్యవస్థను మొత్తంగా ఖాళీ చేయించారు. హులెన్ నగరానికి సమీపంలో గల సొరంగాల్లో చిక్కుకున్న 70 మందిని కాపాడామని అగ్నిమాపక అధికారులు తెలిపారు. భూకంపం ధాటికి దక్షిణ జపాన్, ఫిలిప్పీన్స్‌లో సునామీ హెచ్చరికలను తొలుత జారీ చేశారు. ఆ తర్వాత కాసేపటికే ఉపసంహరించుకున్నారు. చైనా దక్షిణ ప్రావిన్స్ అయిన ఫ్యుజియాన్‌లో కూడా ప్రకంపనలు చోటు చేసుకున్నాయని చైనా ప్రభుత్వ మీడియా తెలిపింది. తైపేలో ఇప్పటివరకు 50కి పైగా ప్రకంపనలు సంభవించాయి.

జైలులో స్వతంత్ర మీడియా బందీ

(మొదటిపేజీ తరువాయి)

న్యూస్‌క్లిక్ ప్రశ్నిస్తోంది. ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం ఇంతవరకు చార్జిషీట్‌ను దాఖలు చేయలేకపోయింది. ఆదాయపుపన్ను శాఖ తన చర్యలను కోర్టులో సమర్ధించుకోలేకపోయింది. నిజానికి ప్రభుత్వం వద్దనే ఎలాంటి స్పష్టమైన ఆరోపణలు, అభియోగాలు లేవు. అయినా సిబిఐ మరోసారి ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం చూస్తుంటే స్వతంత్ర మీడియా సంస్థగా న్యూస్‌క్లిక్‌ను పనిచేయనివ్వకుండా వేధించడమే వారి లక్ష్యంగా కనిపిస్తోంది.

ఏదేమైనా భారత ప్రజాస్వామ్యాన్ని, అందులో అంతర్భాగంగా వున్న క్రిమినల్ జస్టిస్ వ్యవస్థను పరిరక్షించాలనుకునే మనలాంటి వారందరికీ న్యూస్‌క్లిక్ కేసు చాలా ముఖ్యమైనది. ఈ కేసులో ప్రబీర్ పుర్కాయస్థ, న్యూస్‌క్లిక్‌లకు న్యాయం చేకూరేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

తొలి రోజు 25.66 లక్షల పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సామాజిక పింఛన్లు మొదటి రోజు బుధవారం నాడు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 25.66 లక్షల మందికి పంపిణీ చేసినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రం మొత్తమ్మీద 65.69 లక్షల మంది పెన్షనర్లున్నారని, వీరి కోసం ప్రభుత్వం రూ.1,951.69 కోట్లు నిధులు విడుదల చేసిందని తెలిపారు. పింఛన్లు పంపిణీని ఆయా జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించారని, రాష్ట్ర వ్యాప్తంగా 14,994 గ్రామ, వార్డు సచివాలయాలకు గానూ, 13,669 సచివాలయాల్లో పింఛన్ల పంపిణీని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పింఛన్లు ఈ నెల 6వ తేదీ వరకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నాలుగు కేటగిరీలకు చెందిన వారికి పింఛన్లు వారి ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఉదయం 7 గంటల నుంచి పింఛ ను పంపిణీని గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రారంభమ య్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

ఏడువేల నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ

- సచివాలయ విఆర్ఒ సస్పెండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా)

నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన కృష్ణా జిల్లా మచిలీపట్నం 11వ డివిజన్ సచివాలయ విఆర్ఒను సస్పెండ్ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశాల మేరకు ఆర్‌డిఒ తొలగించారు. హద్దులు, సర్వే నంబర్, సంతకం లేకుండా 11,000 నకిలీ ఇళ్ల పట్టాలు తయారు చేశారు. అందులో ఏడువేల పట్టాలను విఆర్ఒ శ్రీదేవి పంపిణీ చేశారు. దీనిపై పలువురు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు విచారించకుండా వైసిపి నేతల ద్వారా లబ్ధిదారులకు నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు విచారణలో తేలడంతో విఆర్ఒను సస్పెండ్ చేసినట్లు ఆర్‌డిఒ ఎం. వాణి తెలిపారు. స్థానిక శాసనసభ్యుల పేర్ని వెంకట్రామయ్య ప్రోద్బలంతో రెవెన్యూ అధికారులు దొంగ పట్టాలు పంపిణీ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని జిల్లా కలెక్టర్‌కు గతంలో మాజీ మంత్రి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర ఫిర్యాదు చేశారు.

పేపరు మిల్లు కార్మికుల ధర్నా

- నూతన వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్
- నేడు యాజమాన్యంతో చర్చలు జరపనున్న జెసిఎల్



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న పేపరుమిల్లు కార్మికులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రాజమండ్రి ఆంధ్రా పేపర్ మిల్ కార్మికులు పరిశ్రమలో బుధవారం ధర్నాకు దిగారు. యాజమాన్యం వెంటనే నూతన వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మిల్లులో ఉన్న 11 రిజిస్టర్ కార్మిక సంఘాలు ఈ ధర్నాలో పాల్గొన్నాయి. వేతన ఒప్పందం కాల పరిమితి పూర్తయ్యి నాలుగేళ్లు అయినా నూతన వేతన ఒప్పందం చేయకుండా యాజమాన్యం మొండిగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ మంగళవారం సాయంత్రం బి షిఫ్ట్‌లో ఉన్న పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు మిల్లు లోపల మెరుపు సమ్మెకు దిగారు. అయినా యాజమాన్యం స్పందించకపోవడంతో బుధవారం ధర్నా నిర్వహించారు. కార్మికులు అర్ధనగ్నంగా, ఫ్లకార్డులను ప్రదర్శిస్తూ ధర్నాలో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ కె.మాధవీలత స్పందించారు. కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ బి.వి.ఎస్.ఎం.వల్లీని విచారించారు. వెంటనే కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ (జెసిఎల్) ఎ.రాణి దృష్టికి తీసుకెళ్లారు. జెసిఎల్ సమక్షంలో గురువారం యాజమాన్యం, కార్మిక సంఘాల నేతలతో చర్చలు జరపనున్నారు.

పాత వేతన ఒప్పందం 2020 జూన్ 30తో ముగిసినప్పటికీ నూతన వేతన ఒప్పందం చేయకుండా యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తోంది. చట్టబద్ధంగా అనేక పద్ధతుల్లో పోరాడినా ఎలాంటి స్పందనా లేదు. నెల రోజుల క్రితం మిల్లులో ఉన్న 11 రిజిస్టర్ కార్మిక సంఘాలు కలిసి సమ్మె నోటీస్ ఇచ్చాయి. ఆ తరువాత ఏలూరు కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ వద్ద యాజమాన్యం, కార్మిక సంఘాల సమావేశం జరిగింది. కార్మిక శాఖ అధికారులు, యాజమాన్యం చేసిన సూచన మేరకు 11 సంఘాలు ఉమ్మడిగా వేతన ఒప్పందానికి సంబంధించిన డిమాండ్లను అందజేశాయి. యాజమాన్యం చర్చలకు పిలిచి వేతన ఒప్పందం చేయబోమని మొండిగా వ్యవహరించింది. దీంతో యూనియన్ నాయకులు మళ్లీ కార్మిక శాఖ అధికారులను ఆశ్రయించారు. కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ సూచనలను యాజమాన్యం పెడచెవిన పెట్టడంతో గత్యంతరం లేక ఆందోళనబాట పట్టామని నాయకులు, కార్మికులు తెలిపారు.

శిక్షణా తరగతులనుసద్వినియోగం చేసుకోవాలి

- సాంకేతిక విద్య కమిషనర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి సూచించారు. పాలిటెక్నిక్ ప్రవేశాల పెంపు లక్ష్యంగా ఇస్తున్న సమగ్ర శిక్షణకు మంచి స్పందన లభిస్తుందని చెప్పారు. విజయవాడ, గుంటూరులోని ఎంబిటిఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌తో సహా, పలు ప్రవేశ శిక్షణ కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పాలిటెక్నిక్ ప్రవేశాలను కోరుకునే ప్రతిఒక్కరికీ శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 87 ప్రభుత్వ, 182 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ నెల 24 వరకు తరగతులు నిర్వహిస్తామని, 25న గ్రాండ్ ప్రీఫైనల్ ప్రవేశ పరీక్షను కూడా నిర్వహిస్తామని వివరించారు. తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమ విద్యార్థులకు ఉపయోగపడేలా రెండు భాషల్లోనూ స్టడీ మెటీరియల్ సిద్ధం చేశామని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల కోరిక మేరకు ఈ నెల 8 నుంచి మరో బ్యాచ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 27న ప్రవేశ పరీక్ష జరగనుందని, దరఖాస్తు గడువు ఈ నెల 5తో ముగియనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్య, శిక్షణ మండలి కార్యదర్శి రమణబాబు, సంయుక్త కార్యదర్శి జానకిరామ్, ఉప కార్యదర్శి రవికుమార్, కళాశాల ప్రిన్సిపల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న చంద్రశేఖరన్

తల్లుల దాతృత్వం వెలకట్టలేనిది

- రోటరీ హ్యూమన్ మిల్క్ బ్యాంక్ ప్రారంభోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి -తిరుపతి

అవసరమైన చంటి బిడ్డలకు ముర్రు పాలు ఇచ్చి వారి ప్రాణాలను కాపాడుతున్న తల్లుల దాతృత్వం వెలకట్టలేనిదని పలువురు వక్తలు అన్నారు. తిరుపతి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.30 లక్షల వ్యయంతో ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన రోటరీ హ్యూమన్ మిల్క్ బ్యాంకును ఎస్‌వి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, అదనపు వైద్య విద్య సంచాలకులు డాక్టర్ చంద్రశేఖరన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ.. రాయలసీమలోనే తొలిసారిగా మదర్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. రోటరీ క్లబ్ వారు చేస్తున్న ఉదార సాయంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రసూతి ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ తల్లి పాలకు కుల, మత, వర్ణ, వర్గ, పేద, ధనిక భేదాలు లేవన్నారు. ఆరోగ్యకరమైన ఏ తల్లి ఇచ్చిన పాలనైనా అవరమైన బిడ్డలకు అందించి పసి పిల్లలను కాపాడాలన్న సంకల్పంతో ఏర్పాటు చేస్తున్న ఈ మిల్క్ బ్యాంక్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సుసేన హెల్త్ ఫౌండేషన్ కార్యదర్శి, నేషనల్ మెడికల్ కమిషన్ సభ్యులు డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ 'తల్లి పాలు అందుబాటులో లేని పిల్లలను కాపాడుకుందాం... తల్లిపాలు దానం చేద్దాం' అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ ముర్రుపాలు దానం చేయడం వల్ల రొమ్ము కేన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయని, ప్రొలాక్టిన్ హార్మోన్ ఉత్పత్తి అయ్యి కుటుంబ నియంత్రణకు సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రుయా ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ జి.రవి ప్రభు, సీనియర్ ప్రిడియాటిషన్ సరితా చౌదరి, సీనియర్ కన్సల్టెంట్ నియో నేటాలజీ డాక్టర్ శ్రీనాథ్ మణికంఠ, ప్రసూతి వైద్య విభాగాధిపతి డాక్టర్ ప్రమీల, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఈ ఐదేళ్ల కాలంతో తన అస్మదీయులకు చెల్లించేందుకు రూ.10 లక్షల కోట్లు అప్పు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.30 వేల కోట్ల బకాయిలను ఎందుకు చెల్లించలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రశ్నించారు. తక్షణమే ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలన్నింటినీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపురోజు మార్చి 31న రిజర్వు బ్యాంకు నుంచి రూ.వెయ్యి కోట్ల అప్పు చేసిన రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆర్థిక సంవత్సరానికి కూడా అప్పులతో స్వాగతం పలుకుతూ ఈ నెల 2న సెక్యూరిటీల వేలం ద్వారా రూ.4 వేల కోట్లు అప్పు తెచ్చిందన్నారు. తెచ్చిన అప్పులను కేవలం తమ అస్మదీయుల బిల్లులకు మాత్రమే ఖర్చు చేస్తోందని విమర్శించారు. ఎన్నికల కోడ్ వచ్చాక కూడా రూ.14,500 కోట్లను తమ వారికి చెల్లించారని, వీటిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఆ మత్స్యకారులు క్షేమం

ప్రజాశక్తి -భోగాపురం, విశాఖ కలెక్టరేట్



విశాఖ తీరానికి క్షేమంగా చేరుకొని మత్స్యకారులు

విశాఖ తీరంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముక్కాం గ్రామానికి చెందిన మత్స్యకారులు బుధవారం ఉదయం అప్పికొండ బీచ్ వద్ద క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. దీంతో అధికారులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ముక్కాం గ్రామానికి చెందిన ఆరుగురు మత్స్యకారులు సోమవారం వేటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వారి ఫిర్యాదు మేరకు కోస్ట్ గార్డ్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం వేకువజామున అప్పికొండ ప్రాంతంలో వారు ఉన్నట్లు గుర్తించారు. సముద్రంలో అలల తాకిడికి తమ బోటు బోల్తా పడినట్టు వారు చెప్పారు. దాన్ని యథాస్థితికి తెచ్చేందుకు ప్రయత్నించగా కుదరలేదని, దీంతో వలలు దాచుకునే ఓ కవర్ సహాయంతో తీరానికి చేరుకున్నామని తెలిపారు.

పలువురు పరామర్శ

క్షేమంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులను విశాఖ ఫిషింగ్ హార్బర్‌లోని మత్స్య శాఖ కార్యాలయానికి తీసుకువచ్చారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అక్కడికి చేరుకొని వారిని పరామర్శించారు. వైసిపి ఎంపి అభ్యర్థి బొత్స ఝాన్సీ, పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, మత్స్యకార సంఘం నాయకులు పిసి.అప్పారావు, జనసేన దక్షిణ నియోజకవర్గం అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ మత్స్యకారులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

పెన్షన్ల వ్యాజ్యం డిస్మిస్

ప్రజాశక్తి-అమరావతి

పెన్షన్లను వలంటీర్ల ద్వారా చెల్లించరాదన్న కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాలను హైకోర్టు కొట్టేసింది. ఇసి తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.

ఇసికి హైకోర్టు నోటీసులు

ఎన్నికల్లో అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్ (ఫామ్-26) తెలుగులోనూ ఉండేలా చేయాలన్న పిల్‌పై హైకోర్టు స్పందించింది. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. విచారణను మే మొదటి వారానికి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పరోక్ష పన్ను వసూళ్లలో రికార్డ్

న్యూఢిల్లీ : దేశంలో పరోక్ష పన్నులు రికార్డు స్థాయిలో వసూలయ్యాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశంలో 14.84 లక్షల కోట్ల పరోక్ష పన్ను వసూళ్లు జరిగాయని సిబిఐసి ఛైర్మన్ సంజయ్ కుమార్ వెల్లడించారు.

2023-24లో జిఎస్‌టి వసూళ్లు రూ.20.18 లక్షల కోట్లకు చేరి.. నూతన మైలురాయిని నమోదు చేశాయన్నారు. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే 11.7 శాతం వృద్ధి చోటు చేసుకుందని సంజయ్ కుమార్ తెలిపారు. జిఎస్‌టి రివైజ్డ్ అంచనాల ప్రకారం.. పరిహారం సెస్ సహా సెంట్రల్ జిఎస్‌టి రూ.9.57 లక్షల కోట్లు కాగా, ఎక్సైజ్ సుంకం రూ.3.08 లక్షల కోట్లు, కస్టమ్స్ రూ.2.19 లక్షల కోట్లు చొప్పున రాబడి నమోదయ్యిందన్నారు.

ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో సమర్పించిన మధ్యంతర బడ్జెట్‌లో రూ.19.45 లక్షల కోట్ల పరోక్ష పన్ను వసూళ్లు జరగొచ్చని అంచనా వేశారు. ఆ లక్ష్యాన్ని మించి వసూళ్లు జరిగాయి. 2023 ఏప్రిల్‌లో జిఎస్‌టి వసూళ్లు ఏకంగా రూ.1.87 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2023-24లో స్థూల పన్ను వసూళ్లు రూ.34.37 లక్షల కోట్లుగా ఉండొచ్చని కేంద్రం అంచనా వేసింది. దేశీయ వినిమయం, ప్రభుత్వ పెట్టుబడుల వ్యయం పెరగడంతో ఆర్థిక వ్యవస్థకు మద్దతు లభిస్తుందని కేంద్ర వర్గాలు పేర్కొన్నాయి.

1.44 లక్షల కోట్ల లోటు

- 2023-24 లోటు లెక్కలు ఖరారు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

2023-24 ఆర్థిక సంవత్సరం భారీ లోటుతో ముగిసింది. ఈ గణాంకాల ప్రకారం సొంత ఆదాయానికి, వ్యయానికి మధ్య భారీ అంతరం నెలకొంది. సొంత పన్నుల ఆదాయం కన్నా వ్యయం 1.44 లక్షల కోట్లు ఎక్కువగా ఉంది.గత ఆదివారంతో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి 2.75 లక్షల కోట్లుతో బడ్జెట్‌ను ఆమోదించుకోగా, అందులో 1.02 లక్షల కోట్లు సొంత ఆదాయంగా వస్తుందని అంచనా వేశారు. అయితే కేవలం 85 వేల కోట్ల వరకు మాత్రమే ఆదాయం లభించినట్లు తేలింది. అయితే వ్యయం మాత్రం ఏకంగా 2.29 లక్షల కోట్లకు చేరింది. దీంతో మొత్తం లోటు 1.44 లక్షల కోట్లుగా నిర్ధారించారు.

రుణాలతోనే ఎక్కువగా భర్తీ

భారీగా నెలకొన్న ఈ లోటును ఎక్కువగా రుణాలతోనే భర్తీ చేశారు. ఇప్పటివరకు 67 వేల కోట్ల వరకు మార్కెట్ బారోయింగ్స్ ద్వారా సేకరించగా, ఇతర రంగాల నుంచి మరో పాతిక వేల కోట్ల వరకు రుణాలు తీసుకున్నట్లు తెలిసింది. ఇలా మొత్తం అంతరం 1.44 లక్షల కోట్లలో 75 నుంచి 75 శాతం వరకు రుణాలతోనే భర్తీ కావడం గమనార్హం.

నెలల వారీగా ఆదాయ, వ్యయ, లోటు వివరాలు (రూ. కోట్లలో)

నెల	ఆదాయం	వ్యయం	లోటు
ఏప్రిల్	8,147	20,320	12,173
మే	6,386	26,576	20,190
జూన్	6,826	24,913	18,087
జూలై	5,579	18,989	13,410
ఆగస్టు	6,299	15,515	9,2156
సెప్టెంబర్	5,938	14,902	8,964
అక్టోబర్	5,491	14,578	9,0867
నవంబర్	10,032	17,073	7,041
డిసెంబర్	5,928	13,174	7,246
జనవరి	6,848	17,661	10,813
ఫిబ్రవరి	7,108	22,047	14,939
మార్చి	10,530	23,720	13,190
మొత్తం	**85,112**	**2,29,468**	**1,44,356**

సిఎస్‌కు ఎన్నికల విధులు అప్పగించొద్దు

- ఎన్నికల సంఘానికి ఎన్‌డిఎ నేతల ఫిర్యాదు

ప్రజాశకి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఎన్‌డిఎ నేతలు డిమాండ్ చేశారు. నాన్‌ఫోకల్ పోస్ట్‌లో సిఎస్‌ను ఉంచాలన్నారు. కొంతమంది అధికారులు, అధికార పార్టీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘన చర్యలకు పాల్పడుతున్నారని రాష్ట్ర ఎన్నికల అదనపు ప్రధాన అధికారిని సచివాలయంలో కలిసి బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మీడియాతో మాట్లాడుతూ.. పెన్షన్ పంపిణీలో ప్రభుత్వం ఇంతలా అభాసుపాలు అవ్వడానికి సిఎస్ కారణమని విమర్శించారు. వలంటీర్లతో పెన్షన్లు పంపిణీ చేయించొద్దని ఎన్నికల కమిషన్ చెప్పిందని, దీనిపై తప్పుడు ప్రచారం చేస్తున్న మంత్రి జోగి రమేష్, వైసిపి నేత పేర్ని నానిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మదనపల్లె సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులతో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని చెప్పించారని చెప్పారు. జగన్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం పింఛనుదారులకు బాధపెట్టడమే జగన్ నైజమని టిడిపి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు.

పవన్ కల్యాణ్‌కు అస్వస్థత

ప్రజాశక్తి - తెనాలి, నెల్లిమర్ల

జనసేన అధినేత పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం ఆయనకు తీవ్ర జ్వరం రావడంతో కాకినాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. దీంతో బుధవారం గుంటూరు జిల్లా తెనాలిలో రోడ్‌షో, బహిరంగసభ రద్దు అయ్యాయి. విజయనగరం జిల్లా నెలిమర్ల పర్యటన కూడా గురువారం రద్దు అయ్యినట్లు నెల్లిమర్ల నియోజకవర్గ జనసేన అభ్యర్థి లోకం మాధవి తెలిపారు. అనారోగ్యం కారణంగా జనసేన అధినేత పర్యటన రద్దు కావడంతో ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

వాల్తేరు రైల్వే ప్రాజెక్టుల పట్ల కేంద్రం నిర్లక్ష్యం

- ముందుకుసాగని రూ.2,500 కోట్ల పనులు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

వాల్తేరు రైల్వే ప్రాజెక్టుల పట్ల కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఏటా 30 మిలియన్ల రైలు ప్రయాణికులు రాకపోకలు సాగించే డివిజన్‌గా, దేశంలోనే రూ.9,800 కోట్ల ఆదాయం సాధించే ఏకైక డివిజన్‌గా వాల్తేరుకు పేరున్నా కేంద్రానికి మాత్రం ఇక్కడి అభివృద్ధి పట్టడం లేదు. కేంద్రంలోని మోడీ సర్కారు 2016లో వాల్తేరు డివిజన్‌ను ఎత్తేసి విజయవాడ డివిజనల్లో కొంత భాగాన్ని, రాయగడ డివిజన్‌లో మరికొంత భాగాన్ని కలిపేసింది. బిజెపి పాలనలో వాల్తేరు డివిజన్ పరిధిలోని కీలక రైల్వే ప్రాజెక్టులు కొడిగట్టుకుపోయాయి. గడిచిన మూడేళ్లలోనే సుమారు రూ.2,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులు నిలిచిపోతున్నాయి. ప్రధానమైన రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధి పనుల పట్ల నిర్లక్ష్యం వల్ల రైలు ప్రయాణికులకు అవస్థలు పెరుగుతున్నాయి.

నిలిచిపోయిన పనులు ఇవే...

విశాఖపట్నం రైల్వే స్టేషన్ రీ డవలప్‌మెంట్ ప్రాజెక్టు నిల్చిపోయింది. రూ.456 కోట్లతో 2016లోనే కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి దీనికి ఆమోదం తెలిపింది. గుజరాత్‌లోని గాంధీధామ్ స్టేషన్‌కు సంబంధించి 2016లోనే రీ డవలప్ మెంట్ సర్వే, టెండరు ఖరారయ్యాయి. ఆ తర్వాత పనులు కూడా పూర్తయ్యాయి. దీంతోపాటే ఆమోదం లభించిన వాల్తేరు రైల్వే ప్రాజెక్టు పనులు మాత్రం ముందుకు సాగలేదు. పిపిపి మోడ్‌లో 45 ఏళ్లకు విశాఖపట్నం స్టేషన్‌కు టెండర్లు పిలవగా 99 ఏళ్లు కావాలని జిఎంఆర్ తదితర బిడ్డర్లు కోరారు. దీంతో, అప్పట్లో దీనికి ఆమోదం లభించలేదు. ఇటీవల మళ్లీ టెండర్లు పిలిచారు. కాగా, 2022లో ఒక కాంట్రాక్టు సంస్థ విశాఖ రైల్వే స్టేషన్ వెనుక భాగంలో మల్టీ కార్ పార్కింగ్ పనులు పట్టింది. ఈ పనులు 2023 ఏప్రిల్‌లో పూర్తి కావాల్సి ఉంది. నిధుల విడుదలలో కేంద్రం జాప్యంతో పనులు ఆగిపోయాయి.

రూ.1,200 కోట్ల 3 కీలక లైన్ పనులపైనా నీలినీడలు

విశాఖపట్నం-గోపాలపట్నం, గోపాలపట్నం-దువ్వాడ, సింహాచలం-పెందుర్తి మధ్య వాల్తేరు డివిజన్‌కు కొత్త రైల్వే లైన్లు పడాల్సి ఉంది. వీటి ఏర్పాటు అంచనా విలువ సుమారు రూ.1200 కోట్లు. రైల్ ఫ్లై ఓవర్లు కూడా నిర్మించాల్సి ఉంది. పై మూడు ప్రాజెక్టులకూ సర్వే జరిగింది. టెండర్లు పూర్తయినా పనులు ప్రారంభం కాలేదు. దీంతో, ప్లాట్‌ఫారాలు ఖాళీలేక గంటల తరబడి అవుట్‌లో రైళ్లను నిలిపి ఉంచాల్సి వస్తోంది.

ప్రయాణికులు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. ఈ మూడు లైన్లు పూర్తయితే ఈ సమస్యకు పరిష్కారమని రైల్వే డిఆర్ఎం కార్యాలయ ఉన్నతాధికారులు కేంద్రానికి గతంలోనే ప్రతిపాదన పంపారు. ప్రస్తుతం యూనివర్సల్ ఎలక్షన్ కోడ్ ఉందని, ఈ పనులు చేపట్టవద్దని కేంద్రంలోని బిజెపి సర్కారు నుంచి ఇటీవల రైల్వేకు ఆదేశాలొచ్చాయి.

అమృత్ భారత్ స్టేషన్‌లకూ అదే గతి

ప్రధాని మోడీ ఘనంగా ప్రచారం చేసుకుంటున్న అమృత్ భారత్ రైల్వే స్టేషన్లలో మౌలిక వసతులు, స్టేషన్ల నిర్మాణ పనులూ నిలిచిపోయాయి. వాల్తేరు రైల్వేలో 12 స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్‌లుగా గుర్తించి అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు మోడీ పునాది రాయి వేసినా పనులు జరగలేదు. సింహాచలం, ఆంధ్రా ఊటీ అరకు, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్డు, నౌపాడ, పర్లాకిమిడి వంటి చోట్ల రైలు ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉండగా, వీటిలో విశాఖపట్నం, పార్వతీపురం, బొబ్బిలి, రాయగడ, పర్లాకిమిడిల్లో మాత్రమే పనులు ప్రారంభమయ్యాయి. మిగతా చోట్ల పనులు కాలేదు. సుమారు రూ.900 కోట్ల మేర రైల్వే ప్రాజెక్టులకు బ్రేక్ పడింది.

సంపాదకీయం

విష వ్యర్థాలు

భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో పేరుకుపోయిన విషపూరిత రసాయనిక వ్యర్థాలను తొలగించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) కొద్ది రోజుల క్రితం చేసిన ఆదేశాలు ఆహ్వానించదగినవి. అయితే, ఈ ఆదేశాలు అమలు కావడమే ప్రశ్నార్థకం! ఎందుకంటే .. ఆ వ్యర్థాలకు సంబంధించి ఈ తరహా ఆదేశాలు ఇంతకుముందు

ఎన్నో వెలువడ్డాయి. దేశ సర్వోన్నత న్యాయస్థానమూ జోక్యం చేసుకుని ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఏర్పాటయి కూడా దశాబ్ద కాలం దాటి పోయింది. సుప్రీంకోర్టు జోక్యానికి ముందు, ఆ తరువాత కూడా ఈ తరహా ఆదేశాలు ఎన్నో వెలువడ్డాయి. అయినా ఫలితం శూన్యం. దీంతో ఆ కోవలోనే ఎన్‌జిటి ఇచ్చిన తాజా ఆదేశాలు కూడా చేరిపోతాయేమోనన్న ఆందోళన స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతోంది. యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో పడి ఉన్న ఈ వ్యర్థాలు 1984 నాటి గ్యాస్ లీకేజి దుర్ఘటన నాటివి అంటే విస్మయం కలగక మానదు! వేలాది మంది ప్రజల ప్రాణాలను బలిగొన్న ఆ దుర్ఘటన తరువాత కూడా మన ప్రభుత్వాలు పాఠాలు నేర్వలేదనడానికి 40 ఏళ్లుగా అక్కడే నిల్వ ఉన్న విషపూరిత వ్యర్థాలే నిలువెత్తు నిదర్శనం. గ్యాస్ దుర్ఘటన దుష్ఫలితాలను ఇప్పటికీ అనుభవిస్తున్న స్థానిక ప్రజానీకం, ఈ వ్యర్థాల కారణంగా కూడా అనేక బాధలకు గురవుతోంది. వీటిని తొలగించాలని వారు కొన్ని దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారు.


వీరి ఒత్తిడి కారణంగా 1990వ దశకంలో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఫ్యాక్టరీ ప్రాంగణంలో నిర్వహించిన సర్వేలో 337 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉన్నాయని, ఇవన్నీ విషపూరితమైనవని నిర్ధారించింది. జాతీయ పరిశోధన సంస్థలు

2009లో నిర్వహించిన అధ్యయనంలో ఒక టన్నుకుపైగా పాదరసం ఆ ప్రాంతమంతా చిందిందని, ఫలితంగా ప్రాంగణంలోని మట్టి పెద్ద ఎత్తున కలుషితమైందని తేలింది. ఎన్‌జిటి స్వయంగా నిర్వహించిన అనేక సర్వేల్లో పరిసర ప్రాంతాల్లో కొన్ని కిలోమీటర్ల దూరం భూగర్భజలాలు పూర్తిగా విషపూరితమయ్యాయని నిర్ధారించింది. అయినా, స్థానికంగా ఉన్న వేలాది మంది ప్రజానీకానికి నేటికీ ఆ నీరే దిక్కు కావడం బాధాకరం! మూడు తరాల తరువాత కూడా 1984 నాటి విషవాయువు లీకేజి దుర్ఘటన ప్రభావం స్థానికులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వారి తరపున పోరాడుతున్న సంఘాల ప్రతినిధులు ప్రస్తుతం చర్చనీయాంశంగా ఉన్న 337 మెట్రిక్‌టన్నులు కాకుండా, ప్రాంగణంలోని మరో 23 చోట్ల ప్రధాన వ్యర్థాలను పూడ్చి వేశారని, ప్లాంటుకు సమీపంలో ఉన్న ఒక చెరువులో కూడా వేల టన్నుల విష వ్యర్థాలను పూడ్చిపెట్టారని చెబుతున్నారు. వీటిని కూడా వెలికితీసి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్మూలించాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఈ వ్యర్థాల ఉనికిని ప్రభుత్వం ఇంకా నిర్ధారించాల్సి వుంది. అంటే, ఈ సమస్య పరిష్కారం కావడానికి ఇంకా ఎన్ని తరాలు మారాలో, ఎందరు ప్రజలు నష్టపోవాలో ఊహించుకోవాల్సిందే!

యూనియన్ కార్బైడ్ అనే కాదు. పారిశ్రామిక వ్యర్థాలను నిర్మూలించడానికి దేశ వ్యాప్తంగానే స్పష్టమైన విధానం లేదు. కార్పొరేట్లకు, పాలకవర్గాలకు కొనసాగుతున్న అపవిత్ర బంధం ఈ పరిస్థితికి కారణం. ఒక అంచనా ప్రకారం దేశ వ్యాప్తంగా ప్రతి ఏడాది 1.20 కోట్ల టన్నుల పారిశ్రామిక వ్యర్థాలు పోగుపడుతున్నాయి. వీటిలో 71,833 టన్నుల వ్యర్థాలు విషపూరితమైనవని అంచనా! వీటిలో అధికభాగాన్ని సమీపంలో ఉన్న చెరువులు, నదులు, సముద్రాల్లో కలిపేస్తున్నారు. మరికొంత భాగాన్ని గుట్టుచప్పుడు కాకుండా పూడ్చేస్తున్నారు. తీర ప్రాంతంలో ఏర్పాటవుతున్న అనేక పరిశ్రమలు వ్యర్థాలను సముద్రంలోకి వదిలివేస్తున్న సంగతి తెలిసిందే. వీటి కారణంగా చేపలు గణనీయంగా తగ్గిపోతున్నాయంటూ మత్స్యకారులు ఆందోళనలకు దిగుతున్నారు.

అభివృద్ధి కార్పొరేట్లకు కాసులు కురిపించేదిగానూ, సామాన్యులకు ప్రాణ సంకటంగానూ, పర్యావరణానికి, జీవావరణానికి హాని చేసేదిగానూ ఉండకూడదు. ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. పారిశ్రామిక వ్యర్థాలు, ముఖ్యంగా విషపూరిత వ్యర్థాల నిర్వహణ విషయాన్ని విస్మరిస్తున్నట్లుగా ఇప్పటివరకు వ్యవహరిస్తున్న విధానాలకు చెల్లుచీటి పలకాలి. తక్షణమే వీటి నిర్వహణకు కచ్చితమైన విధానాన్ని రూపొందించి అమలు చేయాలి.

మహనీయుల మాట



ఎన్ని అందమైన పేర్లు వున్నప్పటికీ బానిసత్వం అనేది నీచమైనది.

- డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాం,
భారత మాజీ రాష్ట్రపతి.

విశ్లేషణ

సంక్షేమ పథకాలు - పాలకుల నైజం



ఎన్నికల సందర్భంగా అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారు. పాలకుల దయాదాక్షిణ్యాల మీద ఇవి అమలు చేయబడుతున్నాయి. ఈ సంక్షేమ పథకాలను ప్రజల హక్కులుగా పార్టీలతో సంబంధం లేకుండా, ఏ ప్రభుత్వమైనా వాటంతటవే అమలు జరిగేలా, ప్రభుత్వాలు మారినా అవి కొనసాగేలా లేదా అంతకన్నా మెరుగైన పథకాలు అమలు జరిగేలా కాకుండా అవి ఎల్లప్పుడూ వారి కనుసన్నలలోనే కొనసాగేలా, వీటిని రాజకీయ స్వార్థం కోసం వినియోగించుకుంటున్నారు. అందువల్లే గడిచిన మూడు దశాబ్దాల్లో ఎన్ని పథకాలు అమలు జరిగినా ప్రజల స్థితిగతుల్లో మార్పులు రాలేదు. ఆర్థిక అసమానతలు పెరిగాయి. ప్రజల మధ్యే కాదు, ప్రాంతాల మధ్య కూడా అంతరాలు పెరిగాయి. అవసరమైన సమృద్ధికర పోషకాహారం తీసుకోలేని వారి సంఖ్య పెరగడంతోపాటు నిరుద్యోగం పెరుగుతున్నది. కొనుగోలు శక్తి పుంజుకోవడం లేదు. విద్య, వైద్యం కొనక్కోవాల్సి వస్తున్నది. ఈ దారుణమైన కష్టాల్లో ఈ పథకాలు ప్రజలకు తాత్కాలిక ఉపశమనాలుగా ఉపయోగపడుతున్నాయనేది వాస్తవం.



డా బి.గంగారావు

దేశంలో పార్లమెంట్‌తో పాటు మరో 5 రాష్ట్రాలకు ఎన్నికల ప్రచారం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలు సంక్షేమ పథకాలను తమ మేనిఫెస్టోలో ప్రకటిస్తున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్ళలో అమలు చేసిన పథకాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నది. ఇప్పటి వరకు రాష్ట్ర బడ్జెట్ నుండి రూ. 2.50 లక్షల కోట్లను వివిధ పథకాల ద్వారా ప్రజలకు ప్రత్యక్షంగా పంపిణీ చేశామని చెబుతున్నది. ఏ ఇంటికి ఎంత లబ్ధి చేకూరిందనే లెక్కలు ప్రచురించి ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. మమ్మల్ని గెలిపిస్తే ఈ పథకాలు కొనసాగించడంతోపాటు ఇంకా అనేక పథకాలు తీసుకొస్తామని ముఖ్యమంత్రి ప్రచారం చేస్తున్నారు. తెలుగుదేశం-జనసేన కూటమి కూడా 6 సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రకటించాయి. సామాజిక పెన్షన్ రూ.4 వేలు, నిరుద్యోగ భృతి రూ.5 వేలు, మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకి రూ.2500, ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెబుతున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నీ రద్దు చేశారని వైసిపిని విమర్శిస్తున్నాయి.

ఆంధ్ర రాష్ట్రమే కాదు, దేశంలో అనేక రాష్ట్రాలలో పాలక బూర్జువా పార్టీలన్నీ ఎన్నికలను పథకాల చుట్టూనే తిప్పుతున్నాయి. ఇక బిజెపి దేశంలో ఇప్పటికే అమలు చేస్తున్న పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో తెగ ఊదరగొడుతున్నది. దేశంలో ఎన్నడూ లేని విధంగా మతంతో ముడిపెట్టి మధుర, కాశీ వంటి తీర్థయాత్రల పథకాలు కూడా ప్రచారం చేస్తున్నది. రెండో వైపున సంక్షేమ పథకాల పట్ల వ్యతిరేక వైఖరిని బిజెపి పెద్ద ఎత్తున ప్రదర్శిస్తున్నది. పన్నుల ద్వారా వస్తున్న ఆదాయాన్ని ఉచితాల పేర ప్రజలకు పంచి పెట్టడం వల్ల దేశం ఆర్థికంగా నష్టపోతున్నదని విమర్శిస్తున్నది. తన కుహనా మేధావులతోను, మధ్యతరగతిలో ఒక వర్గం చేత వ్యతిరేక ప్రచారం సాగిస్తున్నది. ఎన్నికలలో సంక్షేమ పథకాల ప్రచారాన్ని నిషేధించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో సైతం కేసు వేయించింది. అయినా ఎన్నికల్లో అన్ని బూర్జువా పాలక పార్టీలు సంక్షేమ పథకాలనే నమ్ముకొని ప్రచారం సాగిస్తున్నాయి.

దేశంలో నూతన సరళీకరణ విధానాల అమలు అనంతరం గడిచిన మూడు దశాబ్దాల నుండి శ్రామిక ప్రజల సంక్షేమం, సదుపాయాలుపై తీవ్ర దాడి కొనసాగుతున్నది. విద్య, వైద్యాన్ని ప్రైవేటీకరించి పెద్ద ఎత్తున భారాలు మోపారు. సామాజిక భద్రతా హక్కులను నిర్వీర్యం చేశారు. వేతనాలు పెంచకుండా అణిచివేయడం, న్యాయబద్ధమైన వేతనాలు అమలు చేయకపోవడం, ఉపాధి భద్రత, ఉపాధి హక్కు లేకపోవడం, కార్మిక హక్కులను బలహీనపరచడం, రైతుల పంటలకు తగిన మద్దతు ధర కల్పించకపోవడంతో ప్రజల జీవితాలు ఆర్థిక సుడిగుండాల్లో చిక్కుకుపోయాయి. అంతేగాక కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో ప్రజా సంక్షేమంపై సామాజిక న్యాయంపై చేసే ఖర్చులో కోత విధించడం, ప్రజలపై రకరకాల పన్నులు విధించడం, సబ్సిడీలు తొలగించడం, పౌరసేవలను వ్యాపారీకరించడం వంటి సంస్కరణలను అమలు చేయడంతో ప్రజల కష్టాలు తీవ్రమవుతున్నాయి. ఈ భారాలను భరించలేని స్థితికి నెట్టబడుతున్నాయి. ప్రజలు అప్పుల ఊబిలో చిక్కుకుని దినదిన గండంగా గడపాల్సిన పరిస్థితి సృష్టించారు.

ఈ దుస్థితిలో ప్రజలు పాలకులను ప్రశ్నించకుండా ఎన్నికల సందర్భంగా అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారు. పాలకుల దయాదాక్షిణ్యాల మీద ఇవి అమలు చేయబడుతున్నాయి. ఈ సంక్షేమ పథకాలను ప్రజల హక్కులుగా పార్టీలతో సంబంధం లేకుండా, వాటంతటవే అమలు జరిగేలా, ప్రభుత్వాలు మారినా అవి కొనసాగేలా లేదా అంతకన్నా మెరుగైన పథకాలు అమలు జరిగేలా కాకుండా అవి ఎల్లప్పుడూ వారి కనుసన్నలలోనే కొనసాగేలా, వీటిని రాజకీయ స్వార్థం కోసం వినియోగించుకుంటున్నారు. అందువల్లే గడిచిన మూడు దశాబ్దాల్లో ఎన్ని పథకాలు అమలు జరిగినా ప్రజల స్థితిగతుల్లో మార్పులు రాలేదు. ఆర్థిక అసమానతలు పెరిగాయి. ప్రజల మధ్యే కాదు, ప్రాంతాల మధ్య కూడా అంతరాలు పెరిగాయి. అవసరమైన సమృద్ధికర పోషకాహారం తీసుకోలేని వారి సంఖ్య పెరగడంతోపాటు నిరుద్యోగం పెరుగుతున్నది. కొనుగోలు శక్తి పుంజుకోవడం లేదు. విద్య, వైద్యం కొనక్కోవాల్సి వస్తున్నది.

ఈ దారుణమైన కష్టాల్లో ఈ పథకాలు ప్రజలకు తాత్కాలిక ఉపశమనాలుగా ఉపయోగపడుతున్నాయనేది వాస్తవం. అందుకే ఈ పథకాలకు ఎన్ని పరిమితులున్నా వీటిని పాలకులు ఎన్నికల అస్త్రాలుగా వినియోగించుకుంటున్నా మనం సమర్థించాల్సిన అవసరం ఉంది. రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలకు ఇంకా ఆర్థికశక్తి తగ్గితే పాలకులపై పోరాడే శక్తి మరింత తగ్గిపోతుంది. సంక్షేమ చర్యలు శ్రామికుల బేరసార శక్తిని పెంచుతాయి. నిరుద్యోగ భృతి ద్వారా యువత సంఘటితం అవుతుంది. వివిధ రకాల శ్రమజీవుల మధ్య సంఘటిత శక్తి బలపడటమే గాక పాలక వర్గాలపై కూడా ప్రతిఘటన శక్తి పెరుగుతుంది.

సంక్షేమం జానెడు-సంపన్నులకు బారెడు

బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాలపై తీవ్ర వివాదాలు రేపుతున్నది. ఈ పథకాలకు ఎన్నికల తాయిలాలు, ఉచితాలు...ఇలా అనేక పేర్లతో చర్చకు లేవదీస్తున్నది. బడ్జెట్ నిధులన్నీ పథకాలకే ఖర్చు చేస్తున్నారని, అభివృద్ధికి నిధులు లేకుండా పోతున్నాయని విమర్శిస్తున్నది. పారిశ్రామిక అధిపతులకు రాయితీలు ఇవ్వకపోతే, వీరిపై పన్నులు పెంచితే పెట్టుబడులు పెట్టరని వాదిస్తున్నది. దీనివల్ల దేశం అభివృద్ధి కాదని ఎదురు దాడికి దిగుతున్నది.

వాస్తవంగా దేశంలో సంపద పెరుగుతున్నా దేశ బడ్జెట్ ఆదాయం పెరగడం లేదు. బిజెపి ప్రభుత్వం పదే పదే 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ అని, త్వరలో భారత్ ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతున్నదనే ప్రచారం హోరెత్తిస్తున్నది. కానీ దేశ జిడిపిలో పన్ను నిష్పత్తి ప్రపంచ దేశాలతో చూస్తే చాలా అధమ స్థాయిలోనే ఉంది. ఇప్పటికీ జిడిపిలో 11.35 శాతంగానే ఉంది. గత పదిహేనేళ్ళలో ఎదుగూ బొదుగూ లేకుండా ఉంది.

నూతన సరళీకరణ విధానాల కాలంలో దేశంలో సంపన్నులకు భారీగా పన్ను రాయితీలు కల్పించబడుతున్నాయి. కార్పొరేట్ పన్నులు, కస్టమ్స్ ఛార్జీలు, ఎగుమతి, దిగుమతి పన్నులు పెద్దఎత్తున తగ్గించబడ్డాయి. సంపద పన్నును ఏకంగా రద్దు చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చాక బడ్జెట్ పన్ను ఆదాయాలకు లక్షల కోట్లలో గండికొట్టారు. రెండోవైపు బడ్జెట్ ఆదాయంలో కూడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుకూలంగా ఖర్చు పెడుతున్నారు. జిఎస్టీ తదితర పరోక్ష పన్నులు పెంచి ప్రజలపై భారాలు మోపుతున్నారు. ప్రజలకిచ్చే సబ్సిడీలకు కోత పెడుతున్నారు. విద్య, వైద్యంపై కేటాయింపులు తగ్గిస్తున్నారు. సంక్షేమ పథకాలన్నింటిపై నిధులు ఏడాదికేడాది కత్తిరిస్తున్నారు. ఆఖరికి చట్టం చేయబడ్డ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆహార భద్రతా చట్టాలను బలహీనం చేస్తున్నారు. మరోవైపు సంక్షేమ పథకాల అమలుకు ఎక్కువ బాధ్యత వహించే రాష్ట్రాల ఆర్థిక వనరులను కేంద్రం దెబ్బ తీస్తున్నది. ఆర్థిక సంఘం నిధుల్లో కూడా కోత విధిస్తున్నది. ఎఫ్‌ఆర్‌బిఎం చట్టాన్ని వినియోగించి రాష్ట్రాల అప్పులపై తీవ్ర ఆంక్షలను విధిస్తున్నది. ఇవన్నీ చాలక కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వ బ్యాంకుల నుండి తీసుకున్న రూ. లక్షల కోట్ల రుణాలను రద్దు చేస్తున్నారు.

కార్పొరేట్, బడా పారిశ్రామిక సంస్థలకు పన్ను రాయితీలు ఇవ్వకుండా దేశ జిడిపిలో పన్ను నిష్పత్తి కనీసం 30 శాతం స్థాయికి పెంచగలిగినట్లైతే ప్రస్తుతం మరో 50 లక్షల కోట్లు అదనంగా పన్నుల ద్వారా కేంద్ర బడ్జెట్‌కు ఆదాయం వచ్చేది. ఇది జరిగినట్లయితే మన రాష్ట్రానికి కేంద్రం నుండి అదనంగా మరో రూ. లక్ష కోట్లకు పైగా నిధులు బదిలీ అయ్యేవి. రాష్ట్రాల బడ్జెట్ ఆదాయాలన్నీ కనీసం మూడు రెట్లు పెరిగేవి. పాలకుల రాజకీయ స్వార్థం కోసం అమలు చేసేవే అయినప్పటికీ ప్రజలకు తాత్కాలిక ఉపశమనం కలిగిస్తున్న సంక్షేమ పథకాలపై గగ్గోలు పెట్టటం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందనేది అర్థం చేసుకోవాలి.

ఆర్థిక వ్యవస్థలో రాజ్య తిరోగమన జోక్యం

స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వ పెట్టుబడితో పాలకులు పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేయసాగారు. అందులో భాగంగానే ప్రణాళికా సంఘం ఏర్పాటు చేశారు. అంతేగాక విదేశీ, స్వదేశీ ప్రైవేట్ సంస్థలను జాతీయం చేస్తూ విద్య, వైద్యం, సామాజిక, సేవా, మౌలిక సదుపాయాల కల్పనలో భారీగా ప్రభుత్వ పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చేశారు. వ్యవసాయ రంగంలో నీటి ప్రాజెక్టులు, ప్రభుత్వ రంగ సంస్థల నిర్మాణం జరిగింది. ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో ఉన్న వ్యవస్థలన్నీ ఆ విధంగా వచ్చినవే. అలాగే వెనుకబాటుతనం, పేదరిక నిర్మూలన, ఆర్థిక అసమానతల తగ్గింపు...వంటి వాటి కోసం చట్టాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టబడ్డాయి. ఆర్థిక వ్యవస్థలో రాజ్య (పాలకుల) జోక్యం, ప్రభుత్వ పెట్టుబడి బలంగా ఉండేది.

సోవియట్ పతనానంతరం సామ్రాజ్యవాద దేశాలు ప్రపంచ ఆధిపత్యం సాధించాయి. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి విజృంభించింది. ప్రపంచవ్యాపితంగా నూతన సరళీకరణ విధానాల అమలుకు పూనుకున్నాయి. భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి అనుసరిస్తూ వచ్చిన ఆర్థిక విధానాలకు స్వస్తి పలికారు. విద్య, వైద్యం బాధ్యత నుండి వైదొలిగారు. లక్షల కోట్ల రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు, వ్యవస్థలన్నింటినీ ప్రైవేటీకరిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం బడా పెట్టుబడిదారుల ఆస్తుల రక్షణ, పెట్టుబడులకు ద్వారాలు తెరవడం, లాభాలు పెంచడమే ప్రధాన కర్తవ్యంగా మారింది. ఈ నేపథ్యంలో బూర్జువా పాలకుల అసలు నైజం బట్టబయలు కాకుండా వుండేందుకే సంక్షేమ జపం చేస్తున్నారు.

సోషలిజంతోనే సంక్షేమం పుట్టుక

సోవియట్ యూనియన్‌లో 1917లో లెనిన్ నాయకత్వంలో విప్లవం జయప్రదం అయ్యాక ప్రపంచంలో తొలిసారిగా సంక్షేమ పథకాలను కమ్యూనిస్టు ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అప్పటి వరకు ప్రపంచంలో ఏ దేశంలోనూ ప్రజా సంక్షేమ విధానాలు లేవు. ఎక్కడన్నా ఒకటీ అరా వున్నా ప్రజా ఉద్యమాల ద్వారా సాధించుకున్నవే. విద్య, వైద్యం, ఉపాధి, నిరుద్యోగ భృతి, ఆహారం, గృహ వసతి వంటివి సార్వత్రిక హక్కులుగా సోవియట్‌లో ప్రవేశపెట్టారు. భూమి, పరిశ్రమలపై ప్రజల సమిష్టి హక్కు, లాభాల్లో శ్రామికులకు వాటా, 8 గంటల పని విధానం, కార్మికులకు సెలవులు, రెండేళ్ళ వేతనంతో కూడిన మెటర్నటీ సెలవులు, వృద్ధాప్యంలో ప్రభుత్వ బాధ్యత, పెన్షన్ హక్కు...ఇలా మనిషి పుట్టిన దగ్గర నుండి అంతిమ శ్వాస విడిచే వరకు విస్తృతమైన సంక్షేమ హక్కులు కల్పించబడ్డాయి.

ఆ తరువాత అనివార్యంగా సామ్రాజ్యవాద దేశాల్లోనూ సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిన పరిస్థితి సోవియట్ యూనియన్ సృష్టించింది. ముఖ్యంగా రెండో ప్రపంచ యుద్ధానంతరం పెట్టుబడిదారీ దేశాలు ఆర్థికంగా తీవ్రంగా దెబ్బ తినడం, భారాల కారణంగా శ్రామికవర్గం ఉగ్రరూపం దాల్చింది. ఈ పరిస్థితుల్లో పెట్టుబడిదారీ దేశాలన్నీ సోషలిజం వ్యాప్తిని అడ్డుకోవడానికి అనివార్య పరిస్థితుల్లో సోవియట్‌లో అమలు జరుపుతున్న అనేక సంక్షేమ పథకాలను తమ దేశాల్లో ప్రవేశపెట్టాల్సి వచ్చింది. రెండోవైపు యుద్ధంతో చితికిపోయిన ఆర్థిక వ్యవస్థల పునః నిర్మాణం కోసం ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అనేక రంగాల్లో ప్రభుత్వాలే పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. కీన్షియన్ డిమాండ్ మేనేజ్‌మెంట్ విధానాన్ని చేపట్టాయి.

కనుక నేడు పెట్టుబడిదారీ దేశాల్లో సైతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పాలకుల దయాదాక్షిణ్యాల వల్ల వచ్చినవి కావనేది అర్థంచేసుకోవాలి. సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాల్లో సోషలిజం పతనానంతరం కూడా ఈ సంక్షేమ పథకాలను పెట్టుబడిదారీ దేశాలన్నీ హక్కులుగా కొనసాగించడం ఆశ్చర్యం కలిగించకమానదు. అయితే సోవియట్ యూనియన్ పతనానంతరం సంక్షేమ చర్యల పట్ల పెట్టుబడిదారీ దేశాలు బహిరంగంగా వ్యతిరేకతను వెళ్లగక్కాయి. సంక్షేమ పథకాలపై తీవ్ర దాడి ప్రారంభించాయి. కార్మికవర్గం తీవ్ర ప్రతిఘటనతో పాలకులు అనుకున్న స్థాయిలో విజయవంతం కాలేకపోతున్నారు. పెట్టుబడిదారీ దేశాలు సంక్షేమ పథకాలను కొనసాగించడానికిగాను అనివార్యంగా తమ జిడిపిలో పన్నుల నిష్పత్తిని పెంచుకొని బడ్జెట్ ఆదాయాలను పెంచుకోవాల్సి వస్తున్నది. నేడు మన దేశంలో ఇది పూర్తి తిరోగమనం వైపు కొనసాగుతున్నది.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

వ్యాఖ్య

అమెరికా దన్నుతో తెగబడుతున్న ఇజ్రాయిల్



అమెరికా దన్నుతో తెగబడుతున్న ఇజ్రాయిల్ ఒకవైపు ఇరుగు పొరుగు దేశాల మీదనే కాదు గాజాలో మానవతాపూర్వక సాయం అందిస్తున్న విదేశీయుల మీద కూడా దాడులు చేసి చంపివేస్తున్నది. దాని చర్యల మీద ప్రపంచమంతటా తీవ్ర నిరసన వెల్లడి అవుతున్నది. హమాస్ తీవ్రవాదుల అణచివేత ముసుగులో ఆసుపత్రులను కూడా వదలకుండా దాడులు చేస్తున్నది. అక్టోబరు ఏడు నుంచి ఇప్పటి వరకు 33 వేల మంది ప్రాణాలు తీసింది, లక్షలాది మందిని గాయపరచింది. గాజాలోని నివాసాలన్నింటినీ నేలమట్టం గావిస్తున్నది. గాజా పౌరుల మీద జరుపుతున్న మారణకాండకు వ్యతిరేకంగా హైతీ, హిజబుల్లా సాయుధులు ఎర్ర సముద్రం నుంచి ఇజ్రాయిల్ వైపు ప్రయాణించే ఓడలు, ఇజ్రాయిల్ మీద దాడులు జరుపుతున్నారు.

గాజాలో పాలస్తీనియన్లపై మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్ మొత్తం మధ్యప్రాచ్యం, పశ్చిమాసియాను రణరంగంగా మార్చాలని చూస్తున్నది. ఏప్రిల్ ఒకటవ తేదీన సిరియా రాజధాని డమాస్కస్ లోని ఇరాన్ కాన్సులేట్ భవనంపై దాడి చేసి పన్నెండు మందిని బలిగొనటమే దానికి పక్కా తార్కాణం. ఇద్దరు సీనియర్ కమాండర్లు, మరో ఐదుగురు మిలిటరీ సలహాదారులు, ఐదుగురు సిరియన్ పౌరులు ఆ దాడిలో మరణించారు. దీనికి బాధ్యురాలైన ఇజ్రాయిల్‌తో పాటు దాని వెనుక ఉన్న అమెరికా మీద కూడా తగిన చర్య తీసుకుంటామని ఇరాన్ ప్రకటించింది. ఆక్రమిత గోలన్ గుట్టల నుంచి ఎఫ్-35 యుద్ధ విమానాలతో ఆరు క్షిపణులను ప్రయోగించింది. ఒక దౌత్య కార్యాలయం మీద దాడి చేయటం అన్ని రకాల నిబంధనలు, సాంప్రదాయాలను ఉల్లంఘించటం తప్ప మరొకటి కాదు. ఆ దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని, దాడికి వెళుతూ అస్పష్టంగా ఇజ్రాయిల్ ఉప్పందించింది మినహా...వివరాలు చెప్పలేదని అమెరికా బుకాయించింది తప్ప... దాడిని ఖండించకపోగా, దాడితో సంబంధం ఉందని చెప్పి తమపై దాడులకు దిగితే ప్రతిదాడులు చేస్తామని బెదిరింపులకు దిగింది. రష్యా కోరికపై మంగళవారం సాయంత్రం భద్రతా మండలి అత్యవసర సమావేశం జరిపింది. ప్రతిదాడులు జరిపేందుకు తమకు హక్కు ఉందని ఇరాన్ ఈ సమావేశంలో స్పష్టం చేసింది. ఒక దేశ రాయబార కార్యాలయం మీద దాడి జరపటం అంటే ఆ దేశం మీద దాడిగానే చూస్తారు.

అమెరికా దన్నుతో తెగబడుతున్న ఇజ్రాయిల్ ఒకవైపు ఇరుగు పొరుగు దేశాల మీదనే కాదు గాజాలో మానవతాపూర్వక సాయం అందిస్తున్న విదేశీయుల మీద కూడా దాడులు చేసి చంపివేస్తున్నది. దాని చర్యల మీద ప్రపంచమంతటా తీవ్ర నిరసన వెల్లడి అవుతున్నది. హమాస్ తీవ్రవాదుల అణచివేత ముసుగులో ఆసుపత్రులను కూడా వదలకుండా దాడులు చేస్తున్నది. అక్టోబరు ఏడు నుంచి ఇప్పటి వరకు 33 వేల మంది ప్రాణాలు తీసింది, లక్షలాది మందిని గాయపరచింది. గాజాలోని నివాసాలన్నింటినీ నేలమట్టం గావిస్తున్నది. గాజా పౌరుల మీద జరుపుతున్న మారణకాండకు వ్యతిరేకంగా హైతీ, హిజబుల్లా సాయుధులు ఎర్ర సముద్రం నుంచి ఇజ్రాయిల్ వైపు ప్రయాణించే ఓడలు, ఇజ్రాయిల్ మీద దాడులు జరుపుతున్నారు. గాజా మారణకాండను తక్షణమే నిలిపివేయటం, పాలస్తీనా స్వతంత్ర రాజ్యాన్ని పునరుద్ధరించటం తప్ప మరో పరిష్కార మార్గం లేదు. అందుకు సిద్ధంగాని అమెరికా ఆ ప్రాంతంలో చిచ్చు రేపేందుకు కుట్రలు చేస్తున్నది. దానిలో భాగమే ఇరాన్ రాయబార కార్యాలయంపై దాడి. ఇది ఇరాన్ మీదనే కాదు, సిరియా సార్వభౌమత్వం మీద కూడా దాడిగానే ప్రపంచం చూస్తున్నది. ఉద్రిక్తతలను మరింత పెంచేందుకు తప్ప తగ్గించేందుకు ఇలాంటి చర్యలు తోడ్పడవు. అమెరికా, పశ్చిమ దేశాలు ఎందుకీ కుట్రలకు పాల్పడుతున్నాయన్నది ప్రశ్న.

చర్యకు ప్రతి చర్య లేకపోతే సామ్రాజ్యవాదులను నిలువరించటం కష్టం. రెండు ప్రపంచ యుద్ధాలు సామ్రాజ్యవాదుల మధ్య ప్రపంచాన్ని పంచుకొనే క్రమంలో వచ్చిన పేచీలతోనే జరిగాయి. ఆ రెండు యుద్ధాలలో పరస్పరం తలపడిన సామ్రాజ్యవాదులు ఇప్పుడు రాజీపడి ఏకమయ్యారు. తమను ప్రతిఘటిస్తున్నవారిని సహించలేకపోతున్నారు. కీలకమైన మధ్య ప్రాచ్యం, పశ్చిమాసియాలో అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాదులకు చైనా, రష్యా, ఇరాన్ దగ్గర కావటం మింగుడుపడటం లేదు. ఓమన్ గల్ఫ్‌లో ఈ మూడు దేశాల నౌకాదళాలు సంయుక్తంగా సముద్ర భద్రత (మెరైన్ సెక్యూరిటీ బెల్ట్ 2024) పేరుతో భారీ విన్యాసాలు జరుపుతున్నాయి. వీటిలో రష్యా నుంచి వచ్చిన రెండు విమాన వాహక యుద్ధ నౌకలతో పాటు మూడు దేశాలకు చెందిన ఇరవై ఆధునిక యుద్ధ నౌకలు ఉన్నాయి. రాత్రి, పగలు నిర్వహించే విన్యాసాలలో ఉపరితల, గగనతల లక్ష్యాలను చేరుకొనే ఆయుధ ప్రయోగాలు జరుపుతారు. వీటికి పాకిస్తాన్, భారత్, కజకస్తాన్, అజర్‌బైజాన్, ఓమన్, దక్షిణాఫ్రికా నౌకాదళాల ప్రతినిధులు పరిశీలకులుగా ఉన్నారు. ఇవి 2019 నుంచి ఏటా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంతో, ఖండంతో సంబంధం లేని నాటో దేశాల కూటమి వీటికి పోటీగా ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన మూడు దశాబ్దాల తరువాత తొలిసారిగా ఈ ప్రాంతంలో విన్యాసాల పేరుతో బల ప్రదర్శన జరపనుంది. ఈ పరిణామాలను విడివిడిగా చూడలేము. అందుకే మధ్య ప్రాచ్యంలో మారణహోమానికి అమెరికా కూటమి తెర తీస్తున్నదని, దానిలో భాగంగానే ఇరాన్‌పై దాడి అని చెప్పాల్సి వస్తోంది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

జనవాక్యం

ఆహారం వృథా అవుతోంది!



సకల జీవరాశుల మనుగడకు ఆహారం తప్పనిసరి. అటువంటి ఆహారాన్ని ప్రతిరోజూ టన్నుల కొద్దీ పారబోస్తున్నామట. ఇది నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అతి పెద్ద పర్యావరణ, ఆర్థిక సవాళ్లలో ఒకటి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నప్పుడు ఏటా ఆహారం వృథా కావడం మానవాళికి సిగ్గుచేటు. ఆహార వ్యర్థాలను తగ్గించి ఆకలితో ఉన్న వారికి అందజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత. 2022లో ప్రపంచ వ్యాప్తంగా 1.05 బిలియన్ టన్నుల ఆహారం వృథా అయ్యింది. మరోవైపున ప్రపంచ వ్యాప్తంగా 783 మిలియన్ల మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. అంటే జనాభాలో మూడవ వంతు ఆహార అభద్రతతో ఇబ్బందులు పడుతున్నారు. ఇది మొత్తం ఆహార పదార్థాలలో 19 శాతం. వినియోగదారులకు అందుబాటులో వున్న మొత్తం ఆహారంలో దాదాపు ఐదవ వంతు వృథా అవుతున్నది. సగటున ప్రతీ వ్యక్తి 79 కిలోల ఆహారాన్ని వృథా చేస్తున్నారు. ఇందులో పావు శాతం ఆదా చేస్తే ప్రపంచవ్యాప్తంగా ఆకలితో నకనకలాడే కోట్లాది మందికి ఆహారాన్ని అందించవచ్చు. ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ వేసిన అంచనా ప్రకారం భారతదేశంలో ఉత్పత్తి అయిన ఆహారంలో దాదాపు 40 శాతం ఆహారం ప్రతి సంవత్సరం వృథా అవుతున్నది. దేశంలో దాదాపు 23 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్నారు. జనాభాలో 15 శాతం మంది ప్రతి రోజూ ఆకలితో అలమటిస్తున్నారు. నలుగురు పిల్లలలో ఒకరు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. దాదాపు 3000 మంది ప్రతిరోజు సరైన ఆహారం లేని కారణంగా అనారోగ్యంతో మరణిస్తున్నారు. అందుకే ఆహారం వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా వుంది. అవసరమైనప్పుడు మాత్రమే అవసరమైనంత వరకే ఆహారాన్ని కొనుగోలు చేయాలి. ఆహారాన్ని సరిగ్గా భద్రపరచాలి. మిగిలిపోయిన ఆహారాన్ని తిరిగి ఉపయోగించడం, అదనపు ఆహారాన్ని అవసరమైన వారికి అందించడం, ఫుడ్ బ్యాంకులకు పంపించడం మొదలైనవి చేయాలి. పండ్లు వంటి వాటిని నిల్వ చేయడానికి శీతల గిడ్డంగులును నెలకొల్పాలి. నిల్వకు శాస్త్రీయ పద్ధతులను పాటించాలి.

- జనక మోహనరావు దుంగ,
శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్,



నామినేషన్ దాఖలు చేసిన రాహుల్ గాంధీ

తిరువనంతపురం : కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానం నుండి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బుధవారం నామినేషన్ పత్రాలు సమర్పించారు. నామినేషన్ పత్రాల సమర్పణకు ముందు ఆయన కాల్పెట్టలో రోడ్‌షో నిర్వహించారు. ఆయన వెంట ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఉన్నారు.

రాజీవ్ హత్య కేసులోని ముగ్గురు దోషులు విడుదల

తిరుచ్చి : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో దోషులైన ముగ్గురు శ్రీలంక జాతీయులు మురుగన్, రాబర్ట్ పయాస్, జయకుమార్‌లు మంగళవారం రాత్రి విడుదలయ్యారు. జైలు నుండి ముందుగానే విడుదలైన వీరిని తర్వాత తిరుచ్చిలోని ప్రత్యేక శిబిరంలో నిర్బంధంలో వుంచారు. వారిని తిరిగి శ్రీలంకకు పంపించేందుకు కేంద్ర హెం శాఖ నుండి తుది అనుమతి లభించిన తర్వాత ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్న రెవిన్యూ విభాగం వారిని విడుదల చేసింది. భారీ భద్రత మధ్య పోలీసు వాహనంలో వారిని చెన్నై తీసుకెళ్ళారు. అక్కడ నుండి వారి శ్రీలంక వెళ్ళారు. వీరికి కావాల్సిన ప్రయాణ పత్రాలను శ్రీలంక అధికారులు సమకూర్చారు.

మరో ఐదు ఎన్‌జిఒలపై కేంద్రం వేటు

న్యూఢిల్లీ : స్వచ్ఛంద సంస్థలకు నిధుల దక్కనీయకుండా ఆంక్షలు విధిస్తూ వచ్చిన మోడీ సర్కార్ తాజాగా మరో ఐదు ఎన్‌జిఒలపై వేటు వేసింది. చట్టాన్ని ఉల్లంఘించాయని ఆరోపిస్తూ సిఎన్ఐ సినాడికల్ బోర్డ్ ఆఫ్ సోషల్ సర్వీస్, వాలంట్రీ హెల్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఇండో-గ్లోబల్ సోషల్ సర్వీస్ సొసైటీ, చర్చ్‌స్ ఆక్సలరీ ఫర్ సోషల్ యాక్షన్, ఎవాంగ్లికల్ ఫెలోషిప్ ఆఫ్ ఇండియాపై బుధవారం కేంద్రం వేటు వేసింది. ఆయా సంస్థల విదేశీ సహకార నియంత్రణ చట్టం (ఎఫ్‌సిఆర్ఎ) లైసెన్స్‌లను రద్దు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఎఫ్‌సిఆర్ఎ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయడంతో ఆ ఎన్‌జిఒలు విదేశాల నుండి నిధులను స్వీకరించలేవు, అందుబాటులో ఉన్న నిధులను కూడా వినియోగించుకునేందుకు అవకాశం ఉండదు. గత ఐదేళ్లలో కేంద్రం సుమారు 6,600 ఎన్‌జిఒలకు విదేశాల నుండి నిధులు అందకుండా ఎఫ్‌సిఆర్ఎను రద్దు చేసింది. పదేళ్లలో ఈ సంఖ్య 20,693గా ఉంది.

నిండుకుంటున్న టిబి మందులు

న్యూఢిల్లీ : దేశంలో క్షయ వ్యాధి నివారణ కోసం వాడే మందులకు కొరత వచ్చింది. గత ఏడు నెలల కాలంలో ఇలా కొరత ఏర్పడడం ఇది రెండోసారి. కొన్ని రాష్ట్రాలకు అరకొరగా సరఫరా అవుతున్నప్పటికీ అవి ఏ మాత్రం చాలడం లేదు. గత సంవత్సరం ఆగస్టులో కూడా పలు రాష్ట్రాల్లో క్షయ మందులకు కొరత ఏర్పడింది. గత నెల 18న కేంద్ర టిబి విభాగం రాష్ట్రాలకు లేఖలు రాసింది. మూడు నెలలకు సరిపడా మందులను స్థానికంగా కొనుగోలు చేసుకోవాలని సలహా ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం మందులు సేకరిస్తోందని, అయితే అనూహ్య, ఇతర పరిస్థితుల కారణంగా సరఫరాలలో జాప్యం జరగవచ్చునని టిబి విభాగం డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజేంద్ర జోషి ఆ లేఖల్లో వివరించారు. సాధారణంగా రాష్ట్రాల వద్ద ఆరు నెలలకు సరిపడా మందులు నిల్వ ఉంటాయి. అయితే ఇప్పుడు నెల రోజుల అవసరాలు తీర్చే మందులు కూడా వాటి వద్ద లేవు. సొంతగా మందులు కొనుగోలు చేసేందుకు పలు రాష్ట్రాల నోడల్ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల కారణంగా ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడంతో మందుల కొనుగోలు కష్టతరంగా మారింది. మందుల కొరతపై కర్నాటక ఆరోగ్య మంత్రి దినేష్ గుండూరావు ఈ వారం ప్రారంభంలో కేంద్ర ఆరోగ్య మంత్రికి ఓ లేఖ రాశారు. గత సంవత్సరం దేశంలో 25.55 లక్షల కొత్త టిబి కేసులు నమోదయ్యాయి. వీటిలో 1.43 లక్షలు చిన్న పిల్లల కేసులు. క్షయ వ్యాధి నివారణకు వాడే రెండు ఔషధాల సరఫరాకు జనవరిలోనే అంతరాయం ఏర్పడింది.

సంఘ్ పరివార్ చేతిలో సైనిక్ స్కూళ్లు

- 62 శాతం కొత్త పాఠశాలు ఆరెస్సెస్, బిజెపి నేతలకు అప్పగించిన కేంద్రం : నివేదిక
- మోడీ సర్కారు తీరుపై విద్యావేత్తలు, మేధావుల ఆగ్రహం



న్యూఢిల్లీ : కొత్తగా ఏర్పాటు చేయబోయే సైనిక్ స్కూళ్లను కాషాయమయం చేసే యత్నాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్నది. 62 శాతానికి పైగా పాఠశాలలను సంఘ్ పరివార్‌కు, బిజెపి వారికి, మిత్రులకు అప్పగించింది. 'ది రిపోర్టర్స్ కలెక్టివ్' ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం.. కేంద్రం 62 శాతం కొత్త సైనిక్ పాఠశాలలను సంఘ్ పరివార్, బిజెపి రాజకీయ నాయకులు, మిత్రులకు అప్పగించింది. కేంద్ర ప్రభుత్వ పత్రికా ప్రకటనలు, సమాచార హక్కు (ఆర్‌టిఐ) ప్రత్యుత్తరాల నుంచి అందిన సమాచారం దీనిని తెలియజేస్తున్నది. ఇప్పటివరకు జరిగిన 40 సైనిక్ స్కూల్ ఒప్పందాలలో కనీసం 62 శాతం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)కు, దాని అనుబంధ సంస్థలు, బిజెపి రాజకీయ నాయకులు, దాని రాజకీయ మిత్రులు, హిందుత్వ సంస్థలు, వ్యక్తులు, ఇతర హిందూ మత సంస్థలకు సంబంధించిన స్కూళ్లకు అప్పగించారు' అని కలెక్టివ్ వివరించింది. సైనిక్ స్కూల్ విద్యా వ్యవస్థ చరిత్రలో.. ప్రయివేటు వారిని ఎస్ఎస్ఎస్‌తో అనుబంధం పొందేందుకు, పాక్షిక ఆర్థిక సహాయాన్ని అందుకునేందుకు, వారి శాఖలను నిర్వహించటానికి ప్రభుత్వం అనుమతించటం ఇదే మొదటిసారి అని కలెక్టివ్ పేర్కొన్నది.

2021లో భారత్‌లో సైనిక్ పాఠశాలలను నిర్వహించటానికి కేంద్రం ప్రయివేటువారికి తలుపులు తెరిచింది. వార్షిక బడ్జెట్‌లోనూ భారత్ అంతటా 100 కొత్త సైనిక్ పాఠశాలలను ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఈ విధంగా సైనిక్ స్కూళ్లను హేతుబద్ధత లేకుండా బీజేపీ తన మాతృ సంస్థకు, తమ నాయకులకు అప్పగించటం ఏ మాత్రమూ శ్రేయస్కరం కాదని సామాజికవేత్తలు, విద్యా నిపుణులు అంటున్నారు. ఈ విషయంలో కేంద్రం వెనక్కి తగ్గి పారదర్శకతను పాటించాలని వారు సూచిస్తున్నారు.

యుద్ధోన్మాద ఇజ్రాయిల్ సేవలో మోడీ సర్కార్

- తొలి విడతలో 64 మంది నిర్మాణ కార్మికులు
- హెచ్చరికలు, భద్రతా ఆందోళనలు బేఖాతరు

న్యూఢిల్లీ : గాజాలో అమాయక పౌరుల ప్రాణాలను బలిగొంటున్న యుద్ధోన్మాద ఇజ్రాయిల్ సేవలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పరితపిస్తోంది. అంతర్జాతీయ సమాజం మొత్తంగా ఇజ్రాయిల్ యుద్ధ చర్యలను తీవ్రంగా ఖండిస్తూ ఉండగా..అనేక దేశాలు తమ కార్మికులను స్వదేశానికి రప్పించుకున్నాయి. మరోవైపు హమస్ నుంచి ప్రతిఘటన దాడులు జరుగుతుండటంతో ఇజ్రాయిల్ నుంచి నిర్మాణ, ఇతర రంగాల కార్మికులు స్వస్థలాలకు తిరిగివెళ్లిపోయారు. దీంతో ఇజ్రాయిల్‌లో కార్మికులకు తీవ్ర కొరత ఏర్పడింది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నెతన్యాహు ప్రభుత్వం భారత్ నుంచి కార్మికులను పంపాలని కోరగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అందుకు అంగీకరించింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్‌లో ఉద్యోగాల కోసం భారత నిర్మాణ రంగ కార్మికులతో మొదటి బ్యాచ్ ఇక్కడ నుండి మంగళవారం బయలుదేరింది. ఇజ్రాయిల్ రాయబారి నార్ గిలాన్, భారత ప్రభుత్వ అధికారులు వారికి వీడ్కోలు పలికారు. గాజాలో యుద్ధం చేస్తున్న వేళ ఇజ్రాయిల్ ప్రభుత్వం నిర్మాణ రంగ కార్మికులు కావాలంటూ గతేడాది నవంబరులో భారత ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. ఇందుకు అనుసరించాల్సిన ప్రక్రియపై ప్రధాని మోడీతో ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు చర్చలు జరిపారు. హర్యానా, ఉత్తరప్రదేశ్‌లో గత కొద్ది మాసాలుగా 64 మంది కార్మికులను రిక్రూట్ చేసుకున్నారు. రాబోయే కొద్ది వారాల్లో దాదాపు 10 వేల మంది ఇజ్రాయిల్ వెళ్లనున్నారు. వీరందరూ ఎయిర్ ఇండియా, ఇతర చార్టర్డ్ విమానాల్లో వెళ్లనున్నారని జాతీయ నైపుణ్యాల అభివృద్ధి మండలి తెలిపింది. ఇజ్రాయిల్ ఎంబసీ వీరికి వీడ్కోలు పలుకుతూ ఒక కార్యక్రమాన్ని నిర్వహించింది. రెండు దేశాల ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు వీరు బయలుదేరి వెళుతున్నారు. ప్రస్తుతం ఇజ్రాయిల్‌లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా భారత విదేశాంగ శాఖ గతనెల 5న అక్కడికి వెళ్ళే ప్రయాణికులకు, పర్యాటకులకు వారి భద్రతపై హెచ్చరికలు జారీ చేసింది. భద్రతాపరమైన ఆందోళనలు నెలకొన్నప్పటికీ వీరిని పంపాలని భారత ప్రభుత్వం భావించింది. కాగా భారత కార్మికులను సురక్షిత ప్రాంతాలకే పంపాలనే హామీలను భారత ప్రభుత్వం ఏమైనా పొందిందా అని ప్రశ్నించగా విదేశాంగ శాఖ స్పందించడానికి తిరస్కరించింది.

జిడిపి బలాన్నిచ్చిన ఆ ఐదు రాష్ట్రాలు

- జాబితాలో మహారాష్ట్ర, తమిళనాడు, యుపి, రాజస్థాన్, కేరళ
- ఎస్‌బిఐ నివేదిక

న్యూఢిల్లీ : కరోనా తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బ తిన్నది. అయితే, దేశంలోని ఐదు రాష్ట్రాల పనితీరు దేశ జిడిపికి బలాన్నిచ్చింది. మహమ్మారి అనంతరం దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిలూదింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) నివేదిక ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది. ఈ నివేదిక సమాచారం ప్రకారం.. మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కేరళ రాష్ట్రాలు.. మహమ్మారి నుంచి జాతీయ జిడిపికి 235 బేసిస్ పాయింట్లను (బిపిఎస్) జోడించటం ద్వారా అది కోవిడ్‌కు ముందు ఉన్న 5.7 శాతం నుండి 8.1 శాతానికి పెరిగింది. శతాబ్దపు అత్యంత దారుణమైన విపత్తు తర్వాత సగటు అసమానతలు తగ్గుముఖం పట్టాయి. 2021 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మహమ్మారి కారణంగా ఆర్థిక వ్యవస్థ 23 శాతం, ఆ పూర్తి ఆర్థిక సంవత్సరానికి 7 శాతం క్షీణించాయి. 2022-24 ఆర్థిక సంవత్సరానికి గానూ దేశ జిడిపికి మహారాష్ట్ర అత్యధికంగా 110 బిపిఎస్, తమిళనాడు 70, యుపి 60 బిపిఎస్, బిపిఎస్, రాజస్థాన్, కేరళలు 20 బిపిఎస్ చొప్పున అందించాయి.

'అవినీతి'కి బిజెపి అందలం

- దర్యాప్తు ఎదుర్కొంటున్నవారు కాషాయపార్టీ వైపునకు
- 2014 నుంచి ఇలా కమలం గూటికి 25 మంది కీలక నాయకులు
- వీరిలో 23 మందికి కేసుల నుంచి విముక్తి




న్యూఢిల్లీ: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి కోసం బిజెపి 'వాషింగ్ మెషిన్'లా పనిచేస్తున్నదన్న ఆరోపణలను ప్రతిపక్ష పార్టీలు చేస్తున్నాయి. ఈ ఆరోపణలను సమర్థించే విధంగానే.. ఆ పార్టీలోకి చేరిన, సమర్థించిన నాయకుల జాబితా ఉన్నది. ఇతర పార్టీలలో ఉండి కేంద్ర ఏజెన్సీ దర్యాప్తులను ఎదుర్కొంటున్న 25 మంది రాజకీయ నాయకులు 2014 నుంచి బిజెపి పంచన చేరారు. ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. వీరిలో 23 మంది నేతలు తమ కేసుల్లో ఊరటను పొందారు. ఒక ఆంగ్ల వార్త పత్రిక దీనికి గురించి కథనాన్ని వెలువర్చింది.

ఇలా బిజెపికి జై కొట్టి.. కేసులు, దర్యాప్తుల నుంచి ఉపశమనం పొందిన వారిలో అసోం సిఎం హిమంత విశ్వ శర్మ, పశ్చిమ బెంగాల్ కీలక నాయకుడు సువెందు అధికారి, ఎన్‌సిపి చీలిక నేత అజిత్ పవార్, ప్రముఖ వ్యాపారవేత్త నవీన్ జిందాలు వంటి వారు ఉన్నారు. కాంగ్రెస్ నుంచి 10 మంది, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి), శివసేనల నుంచి నలుగురు చొప్పున, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) నుంచి ముగ్గురు, టిడిపికి చెందిన ఇద్దరు, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి), వైసీపీల నుంచి ఒక్కరు చొప్పున ఉన్నారు. ఈ జాబితాలో ఉన్న ఆరుగురు రాజకీయ నాయకులు ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలకు కొన్ని వారాల ముందే బిజెపిలోకి రావటం గమనార్హం.

అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్, అశోక్ చవాన్, హిమంత విశ్వ శర్మ, సువేందు అధికారి, ప్రతాప్ సర్నాయక్, హసన్ ముష్రిఫ్, భావన గవాలీ వంటి కీలక నాయకులు బిజెపి పక్షాన చేరి, దర్యాప్తుల నుంచి ఉపశమనం పొందినవారిలో ఉన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ), ఇన్‌కమ్ ట్యాక్స్ (ఐటి) డిపార్ట్‌మెంట్ వంటి కేంద్ర ఏజెన్సీలను మోడీ ప్రభుత్వం "దుర్వినియోగం" చేయటంపై ప్రతిపక్షాలు గత కొన్నేండ్లుగా గొంతెత్తుతున్న విషయం విదితమే. లోక్‌సభ ఎన్నికలకు కొన్ని నెలల ముందే ఇద్దరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు (హేమంత్ సోరెన్, అరవింద్ కేజ్రీవాల్)ను ఇడి అరెస్టు చేసింది. మరికొందరు నేతలపై దాడి చేసి విచారణకు పిలిచింది.

బిజెపి "క్లీన్" పార్టీ అని చెప్పుకుంటున్నప్పటికీ.. ఎలక్టోరల్ బాండ్లతో పాటు దర్యాప్తు సంస్థల కేసులను ఎదుర్కొంటున్న నాయకులు కాషాయపార్టీకి ఫిరాయించటం వంటివి అసలు వాస్తవాలను తెలియజేస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఎన్‌సిపి అజిత్ పవార్ వర్గానికి చెందిన ప్రఫుల్ పటేల్ అవినీతి కేసులో సిబిఐ క్లోజర్ రిపోర్టు దాఖలు చేసిందనీ, అక్రమ మైనింగ్ కుంభకోణం నిందితుడు గాలి జనార్దన్ రెడ్డి బిజెపిలో చేరారని ఆంగ్ల వార్త సంస్థ వివరించింది. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 95 శాతం ఇడి కేసులు ఆప్ నేతలపైనే ఉన్నాయని తేలింది. 2014 నుంచి 2022 మధ్య, 121 మంది ప్రముఖ నాయకులు ఇడి దర్యాప్తు కిందకు వచ్చారని, వారిలో 115 మంది ప్రతిపక్షాలకు చెందినవారేనని సదరు ఆంగ్ల వార్త సంస్థ తన కథనంలో వివరించింది.

ఐదేళ్లలో 200 మందికిపైగా మావోయిస్టులు మృతి



ప్రజాశక్తి - యంత్రాంగం : బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మావోయిస్టుల్ని హతమార్చడంలో ప్రత్యేక దృష్టి సారించింది. కేవలం గడిచిన ఐదేళ్ల కాలంలో ఎన్‌కౌంటర్ల పేరుతో 200 మందికి పైగా మావోయిస్టుల్ని హతమార్చింది. 2019 నుంచి 2024 ఏప్రిల్ 2 వరకు దేశంలో మావోయిస్టులు 248 మంది మృతి చెందినట్లు తాజా లెక్కలు చెబుతున్నాయి. సంవత్సరాల వారీగా చూసుకుంటే.. మావోయిస్టులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లను పరిశీలిస్తే.. 2019లో (107), 2020లో (109), 2021లో (82), 2022లో (69), 2023లో (69), 2024 (ఏప్రిల్ 2 వరకు) 28 సార్లు ఎన్‌కౌంటర్స్ జరిగాయి.

గత ఐదేళ్లలో సుమారుగా 240 మందికి పైగా మావోయిస్టులు చనిపోయారు. సంవత్సరాల వారీగా చూసుకుంటే.. 2019లో (65), 2020లో (40), 2021లో (51), 2022లో (30), 2023లో (20), 2024 ఏప్రిల్ 2 వరకు (42) మంది మృతి చెందారు. 2019వ సంవత్సరంలో 65 మంది మృతి చెందితే.. 2024లో కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే 42 మంది మావోయిస్టులు మృతి చెందడం గమనార్హం.

గత ఐదేళ్లలో సుమారుగా 1700 మందికిపైగా మావోయిస్టులు అరెస్టయ్యారు. 2019లో (499), 2020లో (438), 2021లో (494), 2022లో (291), 2023లో (428), 2024 (ఏప్రిల్ 2 వరకు) 167 మంది అరెస్టయ్యారు. ఇక మావోయిస్టులకు భద్రతా సిబ్బంది జరిగిన ఎదురు కాల్పుల్లో సుమారు 140 మంది దాకా భద్రతా సిబ్బంది మృతి చెందారు. 2019లో (21), 2020లో (36), 2021లో (46), 2022లో (10), 2023లో (25), 2024 (ఏప్రిల్ 2 వరకు) 6 గురు భద్రతా సిబ్బంది మృతి చెందారు. మావోయిస్టులకు, భద్రతా సిబ్బంది మధ్య జరిగిన కాల్పుల వల్ల గత ఐదేళ్లలో సుమారుగా 200 మందికి పైగా పౌరులు చనిపోయారు. 2019లో (46), 2020లో (47), 2021లో (33), 2022లో (36), 2023లో (41), 2024 (ఏప్రిల్ 2 వరకు) 17 మంది పౌరులు మృతి చెందారు.

13కు చేరిన మావోయిస్టుల మృతులు

కాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ కర్చోలి అటవీ ప్రాంతంలో మంగళవారం పోలీసుల కాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టుల సంఖ్య బుధవారానికి 13కు చేరింది. మంగళవారం పది మంది మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు మరింత విస్తృతంగా దండకారణ్యంలో గాలించారు. వారికి బుధవారం మరో ముగ్గురి మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. సుమారు ఎనిమిది గంటలపాటు కాల్పులు జరగడంతో దండకారణ్యంలో యుద్ధవాతావరణం నెలకొంది. డిఆర్‌జి, ఆర్‌పిఎఫ్, కోబ్రా బెటాలియన్, బస్తర్ బెటాలియన్ దళాలు కూంబింగ్‌లో పాల్గొన్నట్టు ఐజి పి.సుందర్ రాజ్ వెల్లడించారు.

ప్రగ్యాఠాకూర్‌కు ముంబయి ప్రత్యేక కోర్టు మొట్టికాయలు

ముంబయి : బిజెపి ఎంపి ప్రగ్యాఠాకూర్‌కు ముంబయి ప్రత్యేక కోర్టు మొట్టికాయలు వేసింది. 2008 మాలెగావ్ కేసులో ప్రధాన నిందితురాలైన ఆమె వరుసగా విచారణకు గైర్హాజరు కావడంతో బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అనారోగ్యం పేరుతో బుధవారం కూడా ఆమె విచారణకు హాజరుకాలేదు. ఈ నెల 8వ తేదీకల్లా ఆమె ఆరోగ్య పరిస్థితిపై స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించాల్సిందిగా నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ (ఎన్ఐఎ)ని ఆదేశించింది. అనారోగ్య కారణాలతో బెయిల్ పొందిన ప్రగ్యా ఠాకూర్ .. క్రికెట్, బాస్కెట్ బాల్ ఆడటంతో పాటు డ్యాన్సులు చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఆస్పత్రిలో చేరానంటూ గతంలోనూ విచారణను తప్పించుకున్న ఆమె అదే రోజు ఓ కార్యక్రమానికి హాజరవడం గమనార్హం.



అందాల సీతాకోకచిలుక



లావణ్యకు సీతాకోకచిలుకలు అంటే ఎంతో ఇష్టం. వాటిని పట్టుకుంటుంది. సరదా ఆడుకుంటుంది. ఆ తర్వాత వదిలేస్తుంటుంది. అవి రివ్వున ఎగిరిపోతుంటాయి. ప్రతిరోజూ తనకు ఇది ఒక దిన చర్యగా మారింది. ఓ రోజు ఎప్పుడూ తన ఇంటి వద్దకు సీతాకోక చిలుకలు వచ్చాయి. కొన్నింటిని పట్టుకుంది. మళ్లీ వదిలేసింది. అయితే వీటిలో సరికొత్తగా ఇంద్రధనస్సును పోలిన రంగులతో ఓ సీతాకోక చిలుక అబ్బురపర్చింది. ఎంచక్కా దానిని పట్టుకునే ప్రయత్నం చేసింది. అయినా దొరకలేదు. ఇంటి పరిసర ప్రాంతాల వరకూ పరుగెత్తింది. అయినా దొరకలేదు. వీధి చివరి వరకూ ప్రయత్నించింది. అది అందినట్టే అందుతూ పారిపోతూ ఉంది. రొప్పుతూ ఇక నా వల్ల కాదంటూ ఆగిపోయి రోడ్డుపై నడవలేక కూర్చుండిపోయింది.


ఈలోగా ఇంట్లో తన వంట కార్యక్రమాలు పూర్తి చేసిన తల్లి అమల కూతురును భోజనానికి పిలిచింది. ఎంత పిలిచినా పలుకలేదు. ఇంటి బయటకు వచ్చి రోడ్డుపై చూస్తే కుమార్తె రోడ్డుపై కూర్చుని ఉంది. తల్లి పిలుపుతో కుమార్తె ఇంటికి పరుగున చేరుకుంది. 'అమ్మా.. ఈరోజు నేను సరికొత్త సీతాకోక చిలుకను చూశాను. అది ఇంద్రధనస్సును పోలిన రంగులతో చూడటానికి ఎంతో ముచ్చటగా ఉంది. దానిని పట్టుకోవటానికి ఎంతో ప్రయత్నించాను. కానీ అది దొరక్కుండా తప్పించుకుంది' అంటూ చెప్పింది. అప్పుడు తల్లి స్పందిస్తూ 'నువ్వు అమ్మ ఇంటికి ఎలా వచ్చావో... అదేవిధంగా సీతాకోకచిలుక కూడా తన అమ్మ వద్దకు వెళ్లి ఉంటుందిలే...' అంటూ నచ్చచెప్పింది. "అవునా.. అయితే.. ఓకే" అంటూ సంతోషాన్ని వ్యక్తం చేసింది లావణ్య.




-పి.విర్షిత, 4వ తరగతి,
ఎంపిపిఎస్ వానపాముల (హెచ్‌డబ్ల్యు), పెద పారుపూడి మండలం, కృష్ణా జిల్లా.

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన పండ్ల బొమ్మలను అంకెలుగా గణించి వాటికి ఎదురుగా ఇచ్చిన సమాధానాలు సరిచూడండి.



నేను గీసిన బొమ్మ





కళ్లం కుశాల్‌రెడ్డి
3వ తరగతి
ప్రగతి సెంట్రల్ స్కూల్
ప్రగతి నగర్
హైదరాబాద్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

బ్రిటన్ తాను తీసుకున్న గోతిలోనే పడిందా?

- గాజాలో బ్రిటిష్ సహాయక సిబ్బందిని బ్రిటీష్ బాంబులే బలిగొన్నాయా?
- తక్షణమే దర్యాప్తుకు వామపక్ష ఎంపీల డిమాండ్

గాజా : గాజాలో సోమవారం మరణించిన బ్రిటిష్ సహాయ కార్యకర్తలు బ్రిటన్ సరఫరా చేసిన బాంబుల దాడిలోనే మరణించారా అనే అంశంపై తక్షణమే విచారణ జరిపించాలని వామపక్షాల ఎంపీలు, కార్యకర్తలు డిమాండ్ చేశారు.. సోమవారం వరల్డ్ సెంట్రల్ కిచెన్ బృందంపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో ఏడుగురు సహాయక సిబ్బంది మరణించారు. ఈ సంఘటనపై అంతర్జాతీయంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. మరణించిన వారిలో ముగ్గురు బ్రిటిష్ జాతీయులు వున్నారు. బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ కెమరూన్‌కు బుధవారం ఒక లేఖ రాస్తూ లీడ్స్ ఈస్ట్ లేబర్ ఎంపి రిచర్డ్ బర్గన్, బ్రిటన్ తక్షణమే ఇజ్రాయిల్‌కు ఆయుధాల సరఫరాను ఎందుకు నిలిపివేయాలో ఈ దాడి నొక్కి చెబుతోందని అన్నారు. గాజాపై ఇలాంటి ప్రాణాంతకమైన దాడులకు దిగుతూ ఇజ్రాయిల్ ప్రభుత్వం యుద్ధ నేరాలకు పాల్పడుతోందని అన్నారు. మానవతా సాయాన్ని అందచేసే సిబ్బందిపై ఇటువంటి దాడులను అంతర్జాతీయ చట్టం నిషేధిస్తోందని తాను వేరుగా చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. 2015 నుండి ఇజ్రాయిల్‌కు 47.4కోట్ల విలువ చేసే మిలటరీ ఎగుమతులకు బ్రిటన్ లైసెన్స్ మంజూరు చేసిందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. వీటిల్లో యుద్ధ విమానాల విడిభాగాలు, క్షిపణులు, ట్యాంక్‌లు, సాంకేతికత, చిన్నపాటి ఆయుధాలు, మందుగుండు వంటివి వున్నాయి.



ఇజ్రాయిల్ జరిపిన దాడిలో గాజాలో ధ్వంసమైన వరల్డ్ కిచెన్ ఆహార పంపిణీ వాహనాన్ని పరిశీలిస్తున్న చిన్నారులు

దాడికి బాధ్యత అమెరికాదే : ఇరాన్

సిరియాలో ఇరాన్ ఎంబసీపై ఇజ్రాయిల్ దాడి తర్వాత అమెరికా ప్రభుత్వానికి తమ దేశం కీలక సందేశాన్ని పంపించిందని ఇరాన్ విదేశాంగ మంత్రి హుస్సేన్ అమిర్ అబ్దుల్లా తెలిపారు. ఈ దాడిలో అనేకమంది సైనిక కమాండర్లు, సీనియర్ సలహాదారులు మరణించారు. ఇరాన్ విదేశాంగ శాఖలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ అమెరికా డైరెక్టర్ జనరల్ ఇస్సా కమేలిని పిలిపించి ఈ దాడికి తమ తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్టు తెలిపారు. ఇజ్రాయిల్ జరిపిన ఈ తీవ్రవాద దాడికి, నేరానికి బాధ్యత అమెరికాదేనని స్పష్టం చేసినట్టు తెలిపారు. ఇస్లామిక్ దేశాల సమాఖ్య (ఓఐసి) కూడా ఈ దాడిని ఖండించాలని అమిర్ అబ్దుల్లా కోరారు. ఈ మేరకు ఆయన ఓఐసి సెక్రటరీ జనరల్ హుస్సేన్ బ్రహిమ్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఇజ్రాయిల్ నేరాలపై ఓఐసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఓఐసి చీఫ్ కూడా ఇజ్రాయిల్ నేరాన్ని తీవ్రంగా ఖండించారు.

యుద్ధ విమానాల విక్రయానికి అమెరికా ఆమోదం

గాజా యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇజ్రాయిల్‌కు పెద్ద సంఖ్యలో ఆయుధాల అమ్మకాలకు బైడెన్ ప్రభుత్వం ఆమోద ముద్ర వేయనున్నట్లు అమెరికా మీడియా తెలిపింది. 1800కోట్ల డాలర్ల విలువ చేసే ఆయుధాలు ఇజ్రాయిల్‌కు అమ్మనుంది. ఇందుకు సంబంధించిన వర్గాలను ఉటంకిస్తూ సిఎన్ఎన్ ఒక నివేదికను ప్రచురించింది. గతేడాది అక్టోబరు 7న యుద్ధం ఆరంభమైనప్పటి నుండి ఇప్పటివరకు వందకు పైగా మిలటరీ అమ్మకాలు ఇజ్రాయిల్‌కు జరిగాయి.

ఐక్యరాజ్య సమితి ఖండన

సిరియాలో ఇరాన్ ఎంబసీపై దాడిని ఐక్యరాజ్య సమితి తీవ్రంగా ఖండించింది. ఐక్యరాజ్య సమితి అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఖలీద్ ఖియారి మండలిలో మాట్లాడుతూ, ఇజ్రాయిల్ దాడులను ఖండించారు. అత్యంత సంయమనం పాటిస్తూ, అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి వ్యవహరించాలని కోరారు. ప్రాంతీయ అస్థిరతలను రెచ్చగొట్టే ఎలాంటి కవ్వింపు చర్యలకు ఎవరూ పాల్పడరాదని కోరారు. పౌరులు, అలాగే మౌలిక సదుపాయాలను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ఇప్పటికే మధ్య ప్రాచ్యంలో పరిస్థితులు దిగజారుతున్నాయి, ఇలాంటి పరిస్థితుల్లో ఇటువంటి కవ్వింపు చర్యలవల్ల పరిస్థితి మరింత దిగజారే ప్రమాదముందని హెచ్చరించారు.

విపత్తు నిధుల విడుదలకు ఆదేశించండి

- సుప్రీంను ఆశ్రయించిన తమిళనాడు

న్యూఢిల్లీ : విపత్తు సహాయ నిధుల కోసం, జాతీయ విపత్తుల కోసం ఉద్దేశించిన ఆర్థిక సాయాన్ని విడుదల చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గతంలో కర్నాటక కూడా న్యాయస్థానంలో ఇదే రకమైన పిటిషన్ దాఖలు చేసింది. జాతీయ విపత్తు సహాయ నిధులను కేంద్రం నిలిపివేసిందని తమిళనాడు తన పిటిషన్‌లో ఆరోపించింది. తమిళనాడు పిటిషన్‌కు ప్రాధాన్యత ఉన్నందున త్వరలోనే విచారణకు వస్తుందని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ, సిబ్బంది వర్గాలు తెలిపాయి.

కరువుతో విలవిలలాడుతున్న కర్నాటకకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడం లేదని ఆరోపిస్తూ న్యాయం కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో సుప్రీంకోర్టు తలుపు తట్టిన విషయం తెలిసిందే. కాగా తమకు తక్షణ తాత్కాలిక సాయంగా రూ.2,000 కోట్లు అందించేలా చూడాలని తమిళనాడు ప్రభుత్వం కోరింది. ఇటీవల సంభవించిన వరదలు, తుఫాను కారణంగా జరిగిన నష్టానికి రూ.35,000 కోట్లు విడుదల చేసేలా కేంద్రాన్ని వెంటనే ఆదేశించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించింది. నివేదికలపై చర్యలు తీసుకోవడంలోనూ, ఆర్థిక సాయం విడుదలకు నిర్ణయం తీసుకోవడంలోనూ కేంద్రం విఫలమైందని తమిళనాడు ఆరోపించింది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, ఆర్టికల్ 21 కింద పౌరులకు లభించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని విమర్శించింది. కేంద్రం చర్య చట్టవిరుద్ధం, ఏకపక్షం అని అభివర్ణించింది.

గతంలో కూడా అనేక సందర్భాలలో సాయం కోసం కేంద్రాన్ని అభ్యర్థించామని, అయితే కేంద్రం మొండిచేయి చూపిందని తమిళనాడు ప్రభుత్వం తన పిటిషన్‌లో వివరించింది. తుఫాను, అసాధారణ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రం జంట విపత్తులు ఎదుర్కొన్నదని, అయినప్పటికీ కేంద్రం సాయం అందించి తమను ఆదుకోలేదని తెలిపింది. 'నిధుల విడుదలలో జాప్యం చేయడం సమర్ధనీయం కాదు. రాష్ట్రాలకు సాయం అందించడంలో తేడా చూపడం వర్గ వివక్షే అవుతుంది. సవతి తల్లి ప్రేమ చూపడం జాతీయ విపత్తు నిర్వహణ విధానాన్ని ఉల్లంఘించడమే అవుతుంది' అని పేర్కొంది. జాతీయ విపత్తుల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసిన అంతర్ మంత్రిత్వ శాఖల బృందం ఇచ్చిన నివేదికపై కూడా కేంద్రం చర్యలు తీసుకోలేదని మండిపడింది. దీనివల్ల రాష్ట్రంలో అభివృద్ధి కార్యకలాపాలకు విఘాతం కలిగిందని, రాష్ట్ర ప్రజలు మానసిక వేదనను, ఇబ్బందులను అనుభవించారని తమిళనాడు ప్రభుత్వం తన పిటిషన్‌లో తెలిపింది.



రాజ్యసభ కొత్త సభ్యులతో ఛైర్మన్ ధన్‌ఖర్ గ్రూపు ఫొటో

12 మంది రాజ్యసభ సభ్యుల ప్రమాణం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం ఉదయం ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ కొత్త సభ్యులతో ప్రమాణం చేయించారు. కేంద్ర సమాచార, ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్, ఆర్‌జెడి నేత మనోజ్‌కుమార్ ఝా సహా మొత్తం 12 మంది సభ్యులు పెద్దల సభకు ప్రమాణ స్వీకారం చేశారు. ఎల్ మురుగన్, ధర్మశీల గుప్తా, మనోజ్ కుమార్ ఝా, సంజయ్ యాదవ్, గోవింద్‌భాయ్ లాల్జీభాయ్ ధోలాకియా, సుభాష్ చందర్, హర్ష్ మహాజన్, జిసి చంద్రశేఖర్, అశోక్ సింగ్ చంద్రకాంత్, హండోరే మేధా, విశ్రమ్ కులకర్ణి, సాధన సింగ్ తదితరులు ఉన్నారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. గురువారం ఏపి, తెలంగాణకు చెందిన సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.కాగా, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సహా 54 మంది రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేసిన విషయం తెలిసిందే. వీరిలో తొమ్మిది మంది కేంద్ర మంత్రులు కూడా ఉన్నారు. మంగళవారం ఒక్కరోజే 49 మంది రాజ్యసభ ఎంపిలు పదవీ విరమణ చేయగా.. ఐదుగురు ఎంపిలు బుధవారం పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం కేంద్ర మంత్రులుగా కొనసాగుతున్న ఏడుగురి రాజ్యసభ సభ్యులు పదవీ కాలం కూడా మంగళవారంతో ముగిసింది. వీరిలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా, పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా, ఐటి మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, విదేశాంగశాఖ సహాయ మంత్రి వి మురళీధరన్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి నారాయణ్ రాణే, సమాచార, ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ ఉన్నారు. పర్యావరణశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పదవీ కాలం బుధవారంతో ముగిసింది. ఈ కేంద్ర మంత్రులందరూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

వేసవి ప్లాన్ ఏదీ?

- సమీక్షలతోనే సరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భానుడి భగభగలు తీవ్రమౌతున్నాయి. ఈ వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ప్రకృతి విపత్తులశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు అనేక ప్రాంతాల్లో నీటి ఎద్దడి ప్రారంభమైనట్లు వార్తలు వస్తు న్నాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు కనీస మట్టా లకు పడిపోయాయి. విజయవాడ నగరానికి నీరందించే కృష్ణానది ప్రకాశం బ్యారేజీ వద్ద తొమ్మిది అడుగులకు పడిపోయింది. అయితే దీనికి తగిన విధంగా వేసవి కార్యా చరణ ప్రణాళిక ఇంత వరకు సిద్ధం కాలేదు. అధికార యంత్రాంగం సమీక్షలతోసరిపెడుతోంది తప్పితే ఆచరణలో అవసరమైన చర్యలు తీసుకోవడం లేదు. నాగార్జునసాగర్లో 136 టిఎంసిలు, శ్రీశైలంలో 34 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. పులిచింతలలో డెడ్ స్టోరేజీ 3.61 టిఎంసిలు అయితే ప్రస్తుతం 4.23 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. విజయవాడ అవసరాల పేరుతో అక్కడున్న నీటిని ప్రకాశం బ్యారేజీకి వదిలేశారు. బ్యారేజీలోనూ నగరానికి నీరందించే ఇన్‌టేక్‌వెల్స్‌కు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. ప్రకాశం బ్యారేజీలో 1.49 టిఎంసిల నిలువ మాత్రమే ఉంది. ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది.వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు మార్చి నాటికే యాక్షన్ ప్లాను ప్రక్రియ పూర్తి చేయాలి. నిబంధనల ప్రకారం చేయాలనే ఉద్దేశంతో మార్చి చివరివారంలో హడావుడిగా సిఎస్ సమావేశాలు నిర్వహించారు తప్ప కార్యాచరణ అడుగులు పడలేదు.

పాడైన బోర్లు

పట్టణ ప్రాంతాల్లో పాడైన బోర్లను బాగుచేసే పనికి ఇంతవరకు ఒక్క మున్సిపాలిటీ కూడా నిధులు కేటాయించలేదు. టెండర్లూ పిలవలేదు. దాదాపు అన్ని పురపాలక సంస్థల్లోనూ ఈ విషయమై ఫిర్యాదులు అందుతున్నాయి. కర్నూలు నగరంలో రెండు రోజులకు ఒకసారి, పత్తికొండ నియోజకవర్గంలో వారానికి ఒకసారి నీటి సరఫరా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే కొడుమూరులో మహిళలు నీటికోసం సిఎంను అడ్డుకున్నా.కర్నూలుతోపాటు, డోన్, కొడుమూరు, రాయచోటి నియోజకవర్గాల్లోనూ సమస్య ఎక్కువగానే ఉంది. వీటితోపాటు ప్రకాశం జిల్లాలో నీటి సమస్య ఎక్కువగానే ఉంది. అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోనూ సమస్య తీవ్రమవుతోంది. చెరువులు నింపడానికి ప్రత్యేక కార్యాచరణ ఏదీ రూపొందించలేదు.

అధికారుల నియామకం ఎప్పుడు?

మార్చి రెండవ వారంలోనే వేసవి యాక్షన్‌ప్లాను రూపొందించడంతోపాటు దాని అమలుకు ప్రతి జిల్లాకు పర్యవేక్షణ కోసం ఉన్నతాధికారిని నియమించాలి. పెరిగిన అసవరాల రీత్యా యాక్షన్ ప్లానుకు రూ.1500 కోట్ల నుండి రూ.2000 కోట్లు అవసరం ఉంటుంది. కానీ నిధులు కేటాయింపు జరగలేదు. వేసవి యాక్షన్‌ప్లానును పర్యవేక్షిస్తున్న ప్రకృతివిపత్తుల శాఖ కూడా దీనిపై ఎటువంటి ప్రకటనా చేయలేదు.

నోట మాట రాలేదు..



మహానటి సావిత్రి సినీ జీవితంపై వచ్చిన తాజా పుస్తకం 'సావిత్రి క్లాసిక్స్'. ఈ పుస్తకాన్ని సంజయ్ కిషోర్ రచించారు. సావిత్రి కూతురు విజయ చాముండేశ్వరి ప్రచురణ చేశారు. తాజాగా ఈ బుక్ లాంచ్ వేడుక జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా చిరంజీవి హాజరయ్యారు. పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సావిత్రితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. 'మహానటి సావిత్రి గారిపై రాసిన 'సావిత్రి క్లాసిక్స్' పుస్తకాన్ని ఆవిష్కరించడం నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ పుస్తక ఆవిష్కరణకు వారధిగా నిలబడడం నాకు దక్కిన అమూల్యమైన అవకాశంగా భావిస్తాను. సావిత్రి గారి గురించి నాకు తెలిసింది చాలా తక్కువ. నాకు తల్లిలాంటి ఆమె గురించి చెప్పడానికి ఉద్వేగంతో మాటలు రావడం లేదు. నా యాక్టింగ్ కోర్స్ పూర్తి కాకుండానే నాకు 'పునాదిరాళ్లు' సినిమాలో హీరోగా ఛాన్స్ వచ్చింది. ఈ సినిమా షూటింగ్ వెళ్లేటప్పుడు నేను సావిత్రి గారితో కలిసి నటిస్తున్నానని తెలిసింది. ఆ విషయం తెలియగానే షాక్ కొట్టినట్లు అనిపించింది. షూటింగ్ అనంతరం నన్ను సావిత్రి గారి వద్దకు తీసుకువెళ్లగా.. ఆవిడను చూడగానే నాకు మాట రాలేదు. ఈ మహానటినేనా ఇన్నాళ్లు నేను ఆరాధించేది అనుకున్నాను. నన్ను చూడగానే, 'నీ పేరేంటి బాబు'? అని అడిగారు. 'చిరంజీవి' అని చెప్పాను. ఆమె 'శుభం' అన్నారు. ఆ తర్వాత సినిమా షూటింగ్‌లో వర్షం పడింది. అక్కడ డ్యాన్స్ చేస్తూ కింద పడ్డాను.. కిందపడ్డా డ్యాన్స్ చేయడం ఆపలేదు. ఇది చూసిన సావిత్రి గారు నా దగ్గరకు వచ్చి ఫ్యూచర్‌లో మంచి నటుడివి అవుతావు అని మెచ్చుకున్నారు' అంటూ చిరంజీవి సావిత్రి గారి గురించి కొన్ని విషయాలు ఆ కార్యక్రమంలో ముచ్చటించారు. ఈ వేడుకకు రచయిత సంజయ్ కిశోర్, నిర్మాత అల్లు అరవింద్, సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి, సావిత్రి కుమారుడు సతీశ్ కుమార్, మురళీ మోహన్, జయసుధ, బ్రహ్మానందం, తనికెళ్ల భరణి తదితరులు హాజరయ్యారు.

టిడిపిలో 'పెన్షన్ల' టెన్షన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లతో సామాజిక పింఛన్లు పంపిణీ చేయొద్దన్న కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం రాష్ట్రంలో రాజకీయంగా దుమారం లేపింది. ఇసి నిర్ణయంతో తెలుగుదేశం పార్టీలో తొలుత కొంత ఉత్సాహం కనిపించినప్పటికీ ఆ తరువాత పరిస్థితి మారింది. ఫింఛన్లను అడ్డుకున్నారంటూ వైసిపి చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టలేకపోతున్నామన్న అభిప్రాయం ఆ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ఈ విషయంలో తమ వ్యూహం బెడిసికొట్టిందని ఆ పార్టీలోని కొంతమంది నేతలే అభిప్రాయ పడుతున్నారు. పింఛన్లు నిలిపివేయాలని చంద్రబాబు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని వైసిపి గ్రామ స్థాయి నేతలు ఈ రెండు రోజుల్లో విపరీతమైన ప్రచారం చేశారని అంటున్నారు. ప్రభుత్వం ఒకటో తేదీన ఇవ్వాల్సిన పింఛన్ నిధులను మూడో తేదీ వరకు ఎందుకు ఇవ్వలేదనే అంశాన్ని సమర్ధంగా ప్రజల వద్దకు తీసుకువెళ్లడంలో విఫలమయ్యామన్న అభిప్రాయం వినిపిస్తోంది. మూడో తేదీ నాటికి కూడా నిధులు సచివాలయాలకు ఎందుకు అందాలేదో అనే అంశాన్ని గ్రామాల్లో కార్యకర్తల చేత చెప్పించలేకపోయామని భావిస్తున్నారు.పార్టీకి జరిగిన నష్టాన్ని పూడ్చుకునేందుకు టిడిపి అధినేత చంద్రబాబు రంగంలోకి దిగి రావాల్సి వచ్చింది. పింఛన్ల పంపిణీ ఆలస్యం కాకుండా చూడటంతో పాటు, ఇళ్ల వద్దకు అందించాలని ఎన్నికల కమిషన్‌కు, రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖలు రాశారు. వాలంటీర్లు ద్వారా సచివాలయ సిబ్బందిని వినియోగించి పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే అంశంపై ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజలకు ఫోన్ల ద్వారా తన సందేశాన్ని వినిపిస్తున్నారు. అయినా, క్షేత్రస్థాయిలో ఈ ప్రచారం ప్రభావం చూపడంపై టిడిపి శ్రేణుల్లోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విశాఖలో పరుగుల వరద

- కోల్‌కతా నైట్‌రైడర్స్ 272/7,
- ఢిల్లీ క్యాపిటల్స్ 166ఆలౌట్
- టాప్‌లోకి రెండుసార్లు ఛాంపియన్

విశాఖపట్నం: ఎసిఎ-విడిసిఎ క్రికెట్ స్టేడియంలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు ఢిల్లీపై రికార్డు స్కోర్‌ను నమోదు చేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగి కోల్‌కతా ఐపిఎల్ చరిత్రలో 272పరుగుల రెండో అత్యుత్తమ స్కోర్‌ను చేయగా.. ఛేదనలో ఢిల్లీని 166పరుగులకే పరిమితం చేసి 106పరుగుల భారీతేడాతో ఘన విజయం సాధించింది. తొలుత కోల్‌కతాకు శుభారంభం దక్కింది. సాల్ట్-నరైన్ కలిసి తొలి వికెట్‌కు 4.3ఓవర్లలో 60పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇక నరైన్ 39బంతుల్లో 7ఫోర్లు, మరో 7 భారీ సిక్సర్ల సాయంతో 85పరుగులు నమోదు చేశాడు. రఘువంశీ(54) అర్ధసెంచరీతో మెరిసాడు. చివర్లో ఆండ్రూ రస్సెల్(41), శ్రేయస్ అయ్యర్(18) విధ్వంసాన్ని కొనసాగిస్తూ.. కోల్‌కతా స్కోర్ 230 దాటించారు. ఇక రింకు సింగ్ 19వ ఓవర్‌లో వరుసగా 6, 6, 4, 0, 6, 4 బ్యాట్ ఝుళిపించి 26 పరుగులు రాబట్టాడు. దీంతో కోల్‌కతా జట్టు సన్‌రైజర్స్ రికార్డు స్కోర్(277పరుగులు) మార్క్‌ను ఛేదించేలా కనిపించినా.. చివరి ఓవర్లో సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మ కోల్‌కతాను కట్టడి చేశాడు. దీంతో కోల్‌కతా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 272పరుగులు చేసింది. ఈ క్రమంలోనే వైజాగ్‌లో అత్యధిక సిక్సర్ల(15) రికార్డు కొట్టుకుపోయింది. ఢిల్లీ బౌలర్లలో నోర్జేకు మూడు, ఇషాన్‌కు రెండు వికెట్లు దక్కాయి.



ఛేదనలో ఢిల్లీ లక్ష్యాన్ని ఏ రూపంలోనూ ఛేదించేలా కనిపించలేదు. వార్నర్(18), పృథ్వీ షా(10) రెండంకెల స్కోర్ చేయగా.. కెప్టెన్ పంత్(55), స్టబ్స్(54) మాత్రమే అర్ధసెంచరీలతో రాణించారు. మిగిలిన బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పెవీలియన్‌కు చేరారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ ఇలా వచ్చి అలా వెళ్లారు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ 17.2ఓవర్లలో 166పరుగులకు కుప్పకూలింది. కోల్‌కతా బౌలర్లు వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తికి మూడేసి, మిఛెల్ స్టార్క్‌కు రెండు, ఆండీ రస్సెల్, నరైన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సునీల్ నరైన్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు...

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: ఫిల్ సాల్ట్ (సి)స్టబ్స్ (బి)నోర్జే 18, నరైన్ (సి)పంత్ (బి)మిఛెల్ మార్ష్ 85, రఘువంశీ (సి)ఇషాన్ (బి)నోర్జే 54, రస్సెల్ (బి)ఇషాంత్ 41, శ్రేయస్ (సి)మిఛెల్ మార్ష్ (బి)ఖలీల్ అహ్మద్ 18, రింకు సింగ్ (సి)వార్నర్ (బి)నోర్జే 26, వెంకటేశ్ అయ్యర్ (నాటౌట్) 5, రమణ్‌దీప్ సింగ్ (సి)పృథ్వీ షా (బి)ఇషాంత్ 2, మిఛెల్ స్టార్క్ (నాటౌట్) 1, అదనం 22. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 272పరుగులు. వికెట్ల పతనం: 1/60, 2/164, 3/176, 4/232, 5/264, 6/264, 7/266 బౌలింగ్: ఖలీల్ అహ్మద్ 4-0-43-1, ఇషాంత్ శర్మ 3-0-43-2, నోర్జే 4-0-59-3, రషిక్ సలామ్ 3-0-47-0, సుమిత్ కుమార్ 2-0-19-0, అక్షర్ పటేల్ 1-0-18-0, మిఛెల్ మార్ష్ 3-0-37-1.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (బి)స్టార్క్ 18, పృథ్వీ షా (సి)వరణ్ చక్రవర్తి (బి)వైభవ్ అరోరా 10, మిఛెల్ స్టార్క్ (సి)రమణ్‌దీప్ సింగ్ (బి)స్టార్క్ 0, అభిషేక్ పోరెల్ (సి)నరైన్ (బి)వైభవ్ అరోరా 0, రిషబ్ పంత్ (సి)శ్రేయస్ అయ్యర్ (బి)వరణ్ చక్రవర్తి 55, స్టబ్స్ (సి)స్టార్క్ (బి)వరణ్ చక్రవర్తి 54, అక్షర్ పటేల్ (సి)మనీష్ పాండే (బి)వరణ్ చక్రవర్తి 0, సుమిత్ కుమార్ (సి)మనీష్ పాండే (బి)నరైన్ 7, రిషిక్ సలామ్ (సి)సాల్ట్ (బి)వైభవ్ అరోరా 1, అన్రిచ్ నోర్జే (సి)శ్రేయస్ (బి)రస్సెల్ 4, ఇషాంత్ శర్మ (నాటౌట్) 1, అదనం 16. (17.2 ఓవర్లలో ఆలౌట్) 166పరుగులు. **వికెట్ల పతనం:** 1/21, 2/26, 3/27, 4/33, 5/126, 6/126, 7/159, 8/159, 9/161, 10/166 **బౌలింగ్:** స్టార్క్ 3-0-25-2, వైభవ్ అరోరా 4-0-27-3, ఆండీ రస్సెల్ 1.2-0-14-1, సునీల్ నరైన్ 4-0-29-1, వరణ్ చక్రవర్తి 4-0-33-3, వెంకటేశ్ అయ్యర్ 1-0-28-0

28న బంగ్లాదేశ్ పర్యటనకు భారత మహిళలు

ముంబయి: ఈనెల 28న భారత మహిళలజట్టు బంగ్లాదేశ్ పర్యటనకు బయల్దేరి వెళ్లనుంది. ఈ పర్యటనలో భాగంగా టీమిండియా జట్టు బంగ్లాతో ఐదు టి20ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌ను భారత-బంగ్లాదేశ్ క్రికెటర్ బోర్డులు అధికారికంగా ధృవీకరించాయి. 28, 30, మే 9న సిల్హెట్ వేదికలో జరిగే మ్యాచ్‌లు ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరగనున్నట్లు బంగ్లాబోర్డు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. సిల్హెట్ వేదికగా 28న జరిగే తొలి మ్యాచ్‌లో ఈ సిరీస్ ప్రారంభమౌతుందని.. మే 9న అదే వేదికలో జరిగే చివరి మ్యాచ్‌తో సిరీస్ ముగియనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపింది.

షెడ్యూల్...

ఏప్రిల్ 28 : తొలి టి20(సిల్హెట్)
ఏప్రిల్ 30 : రెండో టి20(సిల్హెట్)
మే 2 : మూడో టి20(సిల్హెట్ ఔటర్)
మే 6 : నాల్గో టి20(సిల్హెట్ ఔటర్)
మే 9 : ఐదో టి20(సిల్హెట్)



బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో, చివరి టెస్ట్‌లోనూ శ్రీలంక జట్టు గెలిచి సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 7 వికెట్ల నష్టానికి 268పరుగులతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ జట్టు లంక పేసర్ల ధాటికి 318 పరుగులకే ఆలౌటయ్యింది. కమిందు మెండిస్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కాయి.

స్కోర్స్: శ్రీలంక : 531, 157/7డిక్లేర్డ్ బంగ్లాదేశ్ : 178, 318

ఐపిఎల్‌కు శివమ్ మావి దూరం

గాయంతో వైదొలిగిన లక్నో పేసర్



లక్నో: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-17కు లక్నో యువ పేసర్ శివమ్ మావి దూరమయ్యాడు. గాయం కారణంగా ఈ స్పీడ్‌స్టర్ సీజన్ నుంచి వైదొలిగాడు. ఈ విషయాన్ని బుధవారం లక్నో ఫ్రాంచైజీ ఎక్స్ వేదికగా వెల్లడించింది. 'గాయాల నుంచి కోలుకుని జట్టుతో కలిశాను. కానీ, మళ్లీ గాయపడ్డాడు. దాంతో, సీజన్ మొత్తానికి దూరమవుతున్నా... త్వరలోనే ఫిట్‌నెస్ సాధించి మళ్లీ మీ ముందుకు వస్తా' అని మావి తెలిపాడు. పదిహేడో సీజన్ మినీ వేలంలో రూ.6.4 కోట్లు పలికిన శివం మావి.. ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ ఆడలేదు. ఇక లక్నో పేస్ యూనిట్‌లో షమర్ జోసెఫ్, యశ్ ఠాకూర్, మయాంక్ యాదవ్, స్టోయినిస్‌లు ఉన్నారు. ఐపిఎల్‌లో ప్లే ఆఫ్స్ గండం దాటలేకపోయిన లక్నో జట్టు ఈసారి అదరగొడుతోంది. మయాంక్ యాదవ్ సంచలన బౌలింగ్ ప్రదర్శనతో ప్రత్యర్థుల వెన్నులో వణుకుపుట్టిస్తుండగా.. బ్యాటింగ్‌లో నికోలస్ పూరన్, క్వింటన్ డికాక్‌లు బాదేస్తున్నారు. ఈ సీజన్‌లో లక్నో జట్టు ఆడిన మూడు మ్యాచుల్లో రెండు గెలిచి ఒక మ్యాచ్‌లో ఓటమిపాలైంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68